ప్రజాశక్తి

శుక్రవారం 18 ఏప్రిల్ 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి



జివిఎంసి జోన్ 4 కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న నూకరాజు

మున్సిపల్ కార్మికుల నిరసనల హోరు

ఆప్కాస్‌లో ఉన్న వారిని పర్మినెంట్ చేయాలని డిమాండ్

ఆప్కాస్‌లో ఉన్న మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, కార్మికుల బిడ్డలతో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, క్లాప్ డ్రైవర్లు, లోడర్లు, బదిలీ కార్మికులకు జిఒ 36 ప్రకారం వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ చెల్లించాలని, పనిముట్లు, సేఫ్టీ పరికరాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన విశాఖలోని జివిఎంసి జోనల్ కార్యాలయాల వద్ద గురువారం నిరసనలు చేపట్టారు. డిమాండ్లపై పెద్దపెట్టున నినదించారు. (వార్తలు 4లో..)

పేదలకు నాణ్యమైన విద్య, ఉద్యోగాల కల్పన

- 3400 మందికి ఉచిత డిఎస్‌సి శిక్షణ
- మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, మధురవాడ : పేదలకు నాణ్యమైన విద్య, ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. గురువారం నగరంలోని ద్వారకా నగర్‌లో ఉచిత డిఎస్‌సి శిక్షణా కేంద్రం, మధురవాడలోని కళాశాల ఎస్‌సి వసతి గృహాన్ని ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావుతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డిఎస్‌సి శిక్షణ కేంద్రంలో క్లాస్ రూమ్‌లో విద్యార్థులతో పాటు కూర్చుని సిబ్బంది బోధనా తీరును మంత్రి పరిశీలించారు. అభ్యర్థుల సమస్యలు, శిక్షణ కేంద్రంలో అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్న అనంతరం అభ్యర్థులకు ఉచిత మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 3400 మంది పేద విద్యార్థులకు ఉచితంగా డిఎస్‌సి శిక్షణ ఇస్తున్నామన్నారు. గురుకులాల్లో నీట్ శిక్షణ కేంద్రాలు ప్రస్తుతం మూడే ఉన్నాయని, వాటిని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచనతో పదికి పెంచుతున్నామని తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి బ్యాక్ లాగ్ పోస్టులను త్వరలో భర్తీ చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం పది నెలల కాలంలోనే రూ.300 కోట్లతో కొత్త ఎస్‌సి హాస్టళ్ల నిర్మాణం, గురుకులాలు, వసతి గృహాల్లో మరమ్మతులు చేయించి విద్యార్థులకు అన్ని సౌకర్యాలూ కల్పించినట్టు తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం మిగతా 2లో..



డిఎస్‌సి మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్న మంత్రి డోలా

అవిశ్వాస తీర్మాన సమావేశంపై కలెక్టర్ సమీక్ష

వార్త 2లో..

బాణసంచా గోదాముల్లో తనిఖీలు

వార్త 8లో..

వంటగ్యాస్ సబ్సిడీని ఖాతాల్లో జమచేయాలి

వార్త 4లో..

స్టీమ్ కోల్ దిగుమతిలో విపిటి రికార్డులు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : విశాఖపట్నం పోర్టు అథారిటీలో అంతర్భాగంగా ఉన్న విశాఖ జనరల్ కార్గో బెర్త్ స్టీమ్ కోల్ నిర్వహణలో జంట రికార్డులను నెలకొల్పింది. 24 గంటల్లో రికార్డు స్థాయిలో స్టీమ్ కోల్, 74001 మెట్రిక్ టన్నుల రోజువారీ దిగుమతి రేటును నమోదు చేయడంతో సరికొత్త రికార్డులు నమోదయ్యాయి. ఎంవి గినా ఓల్డెన్ డ్రాఫ్ అనే కేప్-సైజ్ నౌక నుండి మొదటి 24 గంటల్లో రికార్డు స్థాయిలో 1,06,190 మెట్రిక్ టన్నుల స్టీమ్ కోల్‌ను దిగుమతి చేశారు. అలాగే మొత్తం 1,64,960 మెట్రిక్ టన్నుల స్టీమ్ కోల్‌ను కేవలం 53.5 గంటల్లో దిగుమతి చేయడం ద్వారా వీజీసీబీలో 74,001 మెట్రిక్ టన్నుల రోజువారీ నిర్వహణ రేటును నమోదు చేసింది. ఈ అద్భుత విజయాన్ని ఈ నెల 14 మధ్యాహ్నం 2 గంటల నుంచి 16వ తేదీ రాత్రి 9 గంటల మధ్య సాధించినట్టు అధికారులు తెలిపారు. ఈ విజయాన్ని పురస్కరించుకుని విశాఖపట్నం పోర్టు అథారిటీ ఛైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు ట్రాఫిక్ మేనేజర్, అతని బృందాన్ని ప్రశంసించారు.





మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

తాడి సమస్య పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి : పరవాడ ఫార్మా సిటీలో తాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. తాడి తరలింపు, పెదముషిడివాడ ల్యాండ్ పూలింగ్ భూ సమస్యపై పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, పెదముషిడివాడ ల్యాండ్ పూలింగ్ భూ బాధితులు, తాడి నాయకులతో గురువారం కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే రమేష్ బాబు మాట్లాడుతూ తాడి తరలింపునకు చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ గతంలో గ్రామ తరలింపుపై జరిగిన సర్వేలో తేల్చిన లబ్ధిదారుల జాబితాను పరిశీలించి, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా నివేదికలు తయారు చేయిస్తామన్నారు. 20 ఏళ్లలో లబ్ధిదారులు పెరగడంతో తాడి తరలింపునకు కేటాయించిన స్థలానికి సంబంధించిన సర్వే పూర్తి చేసి గ్రామ తరలింపుపై కృషి చేస్తానని తెలిపారు. పెద ముషిడివాడ ల్యాండ్ పూలింగ్ లబ్ధిదారులకు న్యాయం చేస్తామన్నారు. ఆక్రమణదారుల విషయంలో విజిలెన్స్ ఎంక్వయిరీ రిపోర్ట్ అనంతరం సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎపిఐఐసి హెచ్‌డిసి అనిత, అనకాపల్లి ఆర్‌డిఒ షేక్ అయేషా, పరవాడ తహశీల్దార్ అంబేద్కర్, నాయకులు బొద్దపు శ్రీనివాస్, తాడి మాజీ సర్పంచ్ బొడ్డేపల్లి అప్పారావు, గనిరెడ్డి కనకరాజు, గొల్లవిల్లి అచ్చిబాబు, పెదముషిడి వాడ గ్రామస్తులు బలిరెడ్డి అప్పారావు, కరణం నర్సింగరావు, అర్కి అప్పారావు. బొండ అచ్చిబాబు. రావాడ నాయుడు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి..

పేదలకు నాణ్యమైన విద్య, ఉద్యోగాల కల్పన

నుంచి విద్యార్థులకు నాణ్యమైన బియ్యంతో భోజనం పెడతామని తెలిపారు. పి4 ద్వారా పేదరిక నిర్మూలనకు కృషి చేస్తామన్నారు. అనంతరం ఎంవిపి.కాలనీలోని సాంఘిక సంక్షేమ జిల్లా కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. మధురవాడలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల బాలుర వసతి గృహం -1ను మంత్రి సందర్శించి హాస్టల్ స్థితిగతులను వార్డెన్లు బ్రహ్మానందం, ఎస్.రమేష్‌లను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్‌లో వసతి సౌకర్యాలను పరిశీలించారు. హాస్టల్‌కు ఆనుకొని ఉన్న సాంఘిక సంక్షేమ శాఖకు చెందిన విలువైన భూములు అన్యాక్రాంతం కాకుండా కంచె నిర్మాణం, హాస్టల్ చుట్టూ ప్రహరీ నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఆర్‌డిఒ సంగీత్ మధుర్, అర్బన్ తహశీల్దార్ రమేష్, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ జి.రమాదేవి ఉన్నారు.

కూటమి అవినీతితో పరిశ్రమలు విలవిల : బొత్స

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్రంలోని కూటమి పార్టీలు అవినీతి సంపాదన కోసం పరిశ్రమలపై వేధింపులకు పాల్పడుతున్నాయని శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. విశాఖలోని తన క్యాంప్ కార్యాలయంలో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, తైనాల విజయ్‌కుమార్‌లతో కలిసి ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. కూటమి పార్టీ నేతల అరాచకాలతో రాష్ట్రంలోని పరిశ్రమల మనుగడే ప్రశ్నార్థకంగా మారిందని తెలిపారు. ఇప్పటికే జిందాల్ వంటి పారిశ్రామిక దిగ్గజాన్ని వేధించి రాష్ట్రం నుంచి సాగనంపారని, ఇప్పుడు కడప జిల్లాలోని సిమెంట్ పరిశ్రమలను మూయించే కార్యక్రమం చేస్తున్నారని ధ్వజమెత్తారు. రైతాంగాన్ని కూటమి ప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారు. ఉపాధి హామీ పథకం కింద ఎనభై రోజుల నుంచి కూలీలకు వేతనాలు చెల్లించడం లేదన్నారు.



మాట్లాడుతున్న మంత్రి అనిత

ప్రేమ పేరుతో భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : తెలిసీ తెలియని వయసులో ప్రేమ ఉచ్చులో పడి యువత బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోరాదని, లక్ష్యాన్ని ఏర్పరుచుకొని దాని సాధన కోసం నిరంతరం శ్రమించాలని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత హితవు పలికారు. ప్రేమ ముసుగులో యువత బలైపోతున్నారని, ఆవేశంలో చేసిన తప్పులకు జైలుపాలవుతున్నారని విచారం వ్యక్తం చేశారు. పోక్సో కేసుల్లో 60 శాతం మంది 18-20 ఏళ్లలోపు వారే ఉండటం శోచనీయమని పేర్కొన్నారు. ఉడా చిల్డ్రన్ ఎరీనా వేదికగా విశాఖ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 'మహిళా రక్షణకు కలిసికట్టుగా' పేరిట ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా యువతను ఉద్దేశించి పలు అంశాలపై మాట్లాడారు. రాష్ట్రంలో మొదటిసారిగా మహిళ రక్షణకు కలిసికట్టుగా అనే కార్యక్రమానికి విశాఖ నుంచి శ్రీకారం చుట్టామని, మహిళల రక్షణకు, ధైర్యానికి ఇదొక చక్కని వేదిక అవుతుందని మంత్రి పేర్కొన్నారు. గంజాయి యువత భవిష్యత్‌ను నాశనం చేస్తోందని, దానికి యువత దూరంగా ఉండాలని సూచించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎవరినీ హౌస్ అరెస్టులు చేయలేదని అన్నారు. తిరుపతిలో ఎవరిని నిర్బంధించలేదని సమావేశంలో భాగంగా పేర్కొన్నారు. జిల్లా పోలీస్ యంత్రాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విశాఖ సీపీ శంఖబ్రత బాగ్చీ, ఏయూ వీసీ రాజశేఖర్ పాల్గొన్నారు.

జిల్లాను ముందంజలో నిలపడమే లక్ష్యం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విద్య, వైద్య, వ్యవసాయ రంగాల అభివృద్ధికి అధికారులంతా ప్రత్యేక కృషి చేయాలని, జిల్లాను అన్ని రంగాల్లో ముందంజలో ఉంచాలని ఎంపీ శ్రీభరత్ అన్నారు. కలెక్టరేట్ మీటింగు హాలులో గురువారం జరిగిన దిశా (జిల్లా స్థాయి అభివృద్ధి సమన్వయ - మానటరింగ్ కమిటీ) సమావేశంలో కేంద్ర ప్రాయోజిత పథకాల అమలు తీరుతెన్నులపై, క్షేత్రస్థాయి పరిస్థితులపై సమీక్షించారు. జిల్లాలో చేపట్టబోయే అభివృద్ధి ప్రాజెక్టులు, భవిష్యత్తు కార్యాచరణ, ఇతర అంశాలపై చర్చించారు. ముందుగా గత సమావేశంలో చర్చించిన అంశాలు, తీసుకున్న చర్యల గురించి అధికారులను ఆరా తీశారు. ప్రతి ఒక్కరూ జిల్లా సమగ్రాభివృద్ధికి కషి చేయాలని, అంకితభావంతో పని చేయాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో అమలు చేస్తున్న పథకాల ఫలాలు ప్రజలకు చేరువయ్యేలా చర్యలు చేపట్టాలని, లక్ష్యాలు నిర్దేశించుకొని వాటి సాధన కోసం ప్రత్యేక కృషి చేయాలని నిర్దేశించారు. సమావేశంలో భాగంగా దిశా సమావేశపు అజెండాను, జిల్లాలో అమలు చేస్తున్న కేంద్ర పథకాలు, వాటి తాజా పరిస్థితిని ముందుగా జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ వివరించారు. వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం జివిఎంసిలో తవ్విన రోడ్లను వెనువెంటనే పూడ్చాలని, ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులను ఎంపీ ఆదేశించారు. భూగర్భ విద్యుత్, తాగునీటి పైపులైన్ల పనుల నిమిత్తం చాలా చోట్ల రోడ్లను తవ్వేస్తున్నారని, వాటి వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యేలు గణబాబు, పంచకర్ల రమేశ్ బాబు ప్రస్తావించగా ఎంపి స్పందించారు. నిర్దేశించిన పనులు అయిపోయిన వెంటనే రోడ్లను పూడ్చాలని, కొత్తగా వేసిన రోడ్లను తవ్వకుండా ప్రణాళికాయుత చర్యలు చేపట్టాలని సూచించారు.

మే 20 అఖిల భారత సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీసుకువచ్చినటువంటి 4 లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ అఖిలపక్ష కేంద్ర కార్మిక సంఘాలు మే 20న తలపెట్టిన జాతీయ సమ్మెను జయప్రదం చేయాలని విశాఖ అఖిలపక్ష కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. సమ్మె జయప్రదం కోసం గురువారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో సంఘాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్‌కెఎస్‌వి.కుమార్ (సిఐటియు), భోగవిల్లి నాగభూషణం (ఐఎన్‌టియుసి), ఎస్‌కె..రెహమాన్ (ఎఐటియుసి), ఎన్.కనకారావు (సిఎఫ్‌టియుఐ), దేవా (ఎపిఎఫ్‌టియు), రామకృష్ణ రాజు (ఎఐసిటియు), అనీల్ కుమార్ (వైఎస్ఆర్‌టియు) మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తూ కార్మిక చట్టాలను కాలరాస్తోందన్నారు. బ్రిటిష్ కాలంలోనే పోరాడి సాధించుకున్నటువంటి 44 కార్మిక చట్టాలలో 29 చట్టాలను 4 లేబర్ కోడ్స్‌గా మార్పు చేసిందన్నారు. ఈ కోడ్స్ అమలు జరిగితే కార్మికులు ప్రస్తుతం అనుభవిస్తున్నటువంటి అనేక హక్కులను కోల్పోతారన్నారు. పని గంటలు విపరీతంగా పెరుగుతాయన్నారు. సంఘం పెట్టుకునే హక్కు, సమ్మె చేసుకునే హక్కు, యాజమాన్యాలతో జీతభత్యాలు బేరం ఆడుకునే హక్కులను కోల్పోతారన్నారు. ఇప్పటికే విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపులో ఏ విధమైన కార్మిక చట్టాలనూ అమలు చేయకుండా వారికి ఇష్టం వచ్చినట్లు కార్మికులను తొలగిస్తున్నారన్నారు. జాతీయ సమ్మె జయప్రదానికి ఈ నెల 27న జిల్లా కార్మిక సదస్సు జరుగుతుందన్నారు. అన్ని పరిశ్రమల్లోనూ గేట్ మీటింగ్‌లు, కార్మికుల నివాస ప్రాంతాలు, పని ప్రదేశాలలో సభలు, సమావేశాలు జరిపి సమ్మె ప్రాధాన్యతను తెలియజేయనున్నామన్నారు. 20న జరుగుతున్న సమ్మె, ర్యాలీలలో పెద్ద ఎత్తున కార్మిక వర్గం పాల్గొనాలని కోరారు.

సమావేశంలో విశాఖపట్నం పోర్ట్, డాక్ వర్కర్స్ యూనియన్ నాయకులు బి.జగన్, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ కన్వీనర్ పి.మణి, మోటార్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జి.అప్పలరాజు, విశాఖ జిల్లా ముఠా వర్కర్ల సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.సుబ్బారావు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు

అవిశ్వాస తీర్మాన సమావేశంపై కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈ నెల 19న జివిఎంసి మేయర్‌పై ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానానికి సంబంధించి నిర్వహించనున్న కార్పొరేషన్ సమావేశంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ గురువారం జివిఎంసి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌన్సిల్ సమావేశానికి హాజరవుతున్న ఎక్స్ అఫీషియో మెంబర్లు, వార్డు మెంబర్లు కౌన్సిల్ హాల్ ప్రాగణంలోకి ప్రవేశించిన పిదప వారి మొబైల్ ఫోన్‌లను ఫ్లైట్ మోడ్‌లో ఉంచుకోవాలని కోరారు. సంబంధంలేని ఎవరినీ కౌన్సిల్ హాల్ ప్రాంగణంలోకి అనుమతించబోమని అన్నారు.

అవిశ్వాస తీర్మానం పారదర్శకంగా జరగాలి : అమర్‌నాథ్

విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి మేయర్‌పై ఈ నెల 19న అవిశ్వాస తీర్మాన సమావేశం పారదర్శకంగా జరగాలని వైసిపి జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కోరారు. ఈ మేరకు ఆయన గురువారం జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, తైనాల విజయ్ కుమార్, విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కెకె.రాజు, పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి, రవి రెడ్డి, మొల్లి అప్పారావు, పల్లా దుర్గ ఉన్నారు.

పోర్టు ఆసుపత్రి ప్రైవేటీకరణ నిలుపుదల చేయండి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలని కోరుతూ వేలాది మంది సంతకాలతో కూడిన వినతి పత్రాన్ని గురువారం యునైటెడ్ పోర్ట్ అండ్ డాక్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో పోర్టు చైర్మన్ ఎం.అంగముత్తుకు సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షులు విఎస్.పద్మనాభరాజు, ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ మాట్లాడుతూ విశాఖపట్నం పోర్టు గోల్డెన్ జూబ్లీ హాస్పటల్‌ను ప్రైవేటు వారికి ఇవ్వరాదని, సొంత నిధులతోనే అభివృద్ధి చేయాలని, నిపుణులైన డాక్టర్లను, సిబ్బందిని నియమించాలని కోరారు. ప్రయివేటుకు అప్పగించేందుకు పిలిచిన టెండర్లను రద్దు చేయాలన్నారు. పోర్టు చైర్మన్ స్పందిస్తూ సంతకాలు సేకరణ చేసి ఇచ్చిన వినతిపత్రాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. తాత్కాలికంగా నిపుణులైన డాక్టర్లను నియమించడానికి, సాధ్యమైనంత వరకు అందరికీ న్యాయం చేయడానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ చట్టి త్రినాథరావు, విడిఎల్‌బి అండ్ డాక్ వర్కర్స్ యూనియన్, ప్రెసిడెంట్ జక్కాన సత్యనారాయణ, జనరల్ సెక్రటరీ బి.లక్ష్మణరావు పాల్గొన్నారు.



పోర్టు చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వక్ఫ్ బోర్డు సవరణ చట్టం అమలు కాదు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మోడీ నాయకత్వంలో కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం వక్ఫ్ బోర్డు చట్టానికి సవరణ చేస్తూ తీసుకువచ్చిన బిల్లు పార్లమెంట్ ఆమోదం పొందినప్పటికీ, న్యాయ పరంగా అది నిలవదని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ అన్నారు. సుప్రీంకోర్టులో వక్ఫ్ బోర్డు ఆస్తులపై బుధవారంనాటి వాదనలు విన్న తరువాత భారత రాజ్యాంగం అంటే ఏమిటో కేంద్ర ప్రభుత్వానికి తెలియవచ్చిందన్నారు. తుషార్ మెహతా వాదనలు తుస్ అని ఎగిరిపోయాయన్నారు. ముస్లిముల భూములతో బిజెపి నేతలకు ఏం పనని చింతా మోహన్ ప్రశ్నించారు. దేశంలో జర్నలిస్టులకు స్వేచ్ఛ లేదని, నిజాలను నిర్భయంగా రాయలేకపోతున్నారని తెలిపారు. చాలా మీడియా యాజమాన్యాలు వ్యాపారాల్లో మునిగి పోయారన్నారు.

విఎంఆర్‌డిఎ కమిషనర్ విస్తృత పర్యటన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విఎంఆర్‌డిఎ కమిషనర్ కెఎస్.విశ్వనాథన్ గురువారం నగరంలో పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఎంవిపి సెంట్రల్ నర్సరీలో సుమారు 93 లక్షల వ్యయంతో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని గుత్తేదారుకు సూచించారు. తదుపరి ఎన్ఎడి ఫ్లై ఓవర్ వద్ద నిర్మిస్తున్న ఆర్ఒబి (రైల్ ఓవర్ బ్రిడ్జి) పనులు పురోగతిని ఇంజినీర్లు, గుత్తేదారు ప్రతినిధిని అడిగి తెలుసుకుని మే నెలాఖరుకు ఎట్టి పరిస్థితులలో పనులను పూర్తి చేసి బ్రిడ్జిని ఉపయోగంలోకి తీసుకుని రావాలని ఆదేశించారు. ఈ పర్యటనలో ప్రధాన ఇంజినీర్ వినయ్ కుమార్, పర్యవేక్షక ఇంజినీర్ బలరామరాజు, కార్యనిర్వాహక ఇంజినీర్ మధుసూదనరావు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించకుంటే రూ.1035 జరిమానా

ప్రజాశక్తి -ఆనందపురం : ద్విచక్ర వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లేకుంటే రూ.1035 అపరాధ రుసుం విధిస్తున్నట్లు ఆనందపురం ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపితే రూ.10 వేలు, మైనర్ డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే రూ.5035, అతి వేగంగా డ్రైవింగ్, త్రిబుల్ డ్రైవింగ్‌కు రూ.1035, వాహనాలకు ఉన్న పెండింగ్ చలానాలు కట్టించేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని చెప్పారు. నూతనంగా తీసుకొచ్చిన మోటార్ వెహికల్ చట్టం ప్రకారం ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించరాదని, ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించి సహకరించాలని కోరారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని పెద్దిపాలెం ఫీడర్ ఆనందపురం లైన్ నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎఇ అప్పలనాయుడు తెలిపారు. ఆనందపురం సుఖీభవ లే-అవుట్, పొడుగుపాలెం ఇండస్ట్రియల్ ఏరియా, ఏనుగులపాలెం, చందక, పొడుగుపాలెం, వెంకటాపురం, జగన్నాథపురం, గొట్టిపల్లి, కుసులవాడ తదితర ప్రాంతాలకు విద్యుత్ ఉండదని, గృహ, వ్యవసాయ, పారిశ్రామిక వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

డిగ్రీ కళాశాలకు రూ.1.65 లక్షలు

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆంధ్రా యూనివర్సిటీకి 2022 -23 ,2023 - 24 విద్యా సంవత్సరానికి సంబంధించిచెల్లించాల్సిన అనుబంధ రుసుము రూ,1.65 లక్షల చెక్కును చిప్పాడ దివీస్ సంస్థ సిఎస్ఆర్ ఇన్‌ఛార్జి ఎ.శ్రీనివాస్ గురువారం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీవాణికి అందజేశారు. తమ కళాశాలకు ఆర్థిక వనరులు సరిపడా లేనందున ఎయుకు బకాయి ఉన్న అనుబంధ రుసుములు చెల్లించాల్సి ఉందని, ఇందుకు సహకారం అందించాలని ప్రిన్సిపల్ కోరిన మీదట తమ సంస్థ సానుకూలంగా స్పందించినట్లు శ్రీనివాస్ తెలిపారు. కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సీతంనాయుడు, సిఎస్ఆర్ ప్రతినిధులు పి.శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష తప్పితే జీవితం కోల్పోయినట్లు కాదు

ప్రజాశక్తి -పద్మనాభం : పరీక్షలలో ఒకసారి తప్పినంత మాత్రాన జీవితమంతా కోల్పోయినట్లు కాదని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కెరీర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్లు కృష్ణవేణి, డి.ఝాన్సీ, ఎస్.మంగమ్మ చెప్పారు. త్వరలో పదో తరగతి పరీక్షల ఫలితాలు విడుదల కానున్న నేపథ్యంలో కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో 'పరీక్షలు మార్కులే జీవితమా' అనే అంశంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. విశాఖ జిల్లా సమగ్ర శిక్ష అధికారి డాక్టర్ చంద్రశేఖర్, జిసిడిఒ డాక్టర్ కలేశా బేగం ఆధ్వర్యాన మూడు కెజిబివిల విద్యార్థులకు కృష్ణాపురంలో ఏర్పాటుచేసిన సదస్సులో మెంటల్ హెల్త్ కౌన్సెలర్లు మాట్లాడుతూ, పరీక్షలలో ఉత్తీర్ణత సాధించలేకపోయిన ఎందరో వ్యక్తులు జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించారని వివరించారు. 10వ తరగతి విద్యార్థులకు మార్కులే ముఖ్యం కాదు, జీవితంలో ఇంకెన్నో సాధించవచ్చని తెలిపారు. 10వ తరగతి రాసిన విద్యార్థులకు మనోధైర్యాన్ని ఇవ్వడం కోసం ఈ కార్యక్రమం చేపట్టినట్లు పద్మనాభం కెజిబివి ప్రిన్సిపల్ కె.గ్రేస్‌లిల్లీ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన

ప్రజాశక్తి -ఆనందపురం : తాగు నీటి కోసం మండలంలోని లోడగలవానిపాలెం పంచాయతీ పరిధి ఎస్‌సి కాలనీ వాసులు గురువారం ఖాళీ బిందెలతో మండల పరిషత్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. అనంతరం ఎంపిడిఒ జానకికి వినతిపత్రం అందించారు. దళిత సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు సియాద్రి రాంబాబు, దళిత సీనియర్ నాయకులు భాగం గోపాలరావు మాట్లాడుతూ, ఎంపిడిఒ కార్యాలయం సమీపంలో సుమారు 40 ఏళ్ల క్రితం ఎస్‌సి.కాలనీ ఏర్పడిందని, ఈ కాలనీలో ప్రస్తుతం 150 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని తెలిపారు. సుదూరంలో ఉన్న ట్యాంక్ నుంచి అరకొర పైపులతో మంచినీటిని అందిస్తున్నారని, ప్రస్తుతం అవి మరమ్మతులు గురికావడంతో వారం రోజులుగా కాలనీవాసులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాలనీలో మంచినీటి ట్యాంకును



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

ఏర్పాటుచేసి ఇంటింటికీ కుళాయి వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు మామిడి శివకుమార్, బోని సన్నిబాబు, యాగాటి రామారావు, మహిళలు ఎద్దు రాణి, నాగోతి నరసయ్యమ్మ, ఎద్దు పార్వతి తదితరులు పాల్గొన్నారు.

లేజర్ రిఫ్రాక్టివ్ సర్జరీతో కళ్లద్దాలకు దూరం



డాక్టర్ మరియా బషీర్

ప్రజాశక్తి - ఆరిలోవ : లేజర్ రిఫ్రాక్టివ్ సర్జరీతో కళ్లద్దాలు అవసరం లేకుండా చేయవచ్చని ఎల్‌వి.ప్రసాద్ కంటి ఆసుపత్రి నేత్ర వైద్యులు డాక్టర్ మరియా బషీర్ పేర్కొన్నారు. లేజర్ సోర్స్‌ను ఉపయోగించి కళ్లలో కార్నియా ఒంపును సరిదిద్దడం ద్వారా రోగికి కళ్లద్దాలు అవసరం లేకుండా సహాయపడే ఓ ప్రక్రియ అని వివరించారు. ఈ శస్త్ర చికిత్సను సాధారణంగా మయోపియా (హ్రస్వదృష్టి), హైపర్‌మెట్రోపియా (దూరదృష్టి), ఆస్టిగ్మాటిజం (వక్ర దృష్టి)లను సరిచేయడానికి చేస్తున్నట్లు తెలిపారు. ఈ శస్త్రచికిత్స చేయాలంటే రోగి వయస్సు కనీసం 21 సంవత్సరాలు ఉండాలని, కనీసం ఒక సంవత్సరం పాటు స్థిరమైన దృష్టిని కలిగి ఉండాలని పేర్కొన్నారు. అపవర్తన దోషం అతితక్కువగానూ, మితంగానూ ఉండాలని, రోగి కళ్లు మంచి మందం గల కార్నియాలను కలిగి ఉండాలని, నీటి కాసులు, కెరాటొకోనస్, కంటి శుక్లం లాంటి ఇతర కంటి వ్యాధులు ఉండకూడదని తెలిపారు. లేజర్ రిఫ్రాక్టివ్ సర్జరీ ద్వారా కళ్లద్దాలు లేకుండా డ్రైవింగ్ చేయగలిగేంత స్పష్టంగా చూడగలిగే దృష్టిని పొందడం, అద్దాలపై ఆధారపడటాన్ని తగ్గించడం, చూపును త్వరితగతిన తిరిగి పొందడం ఇలా ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని వివరించారు. లేజర్ రిఫ్రాక్టివ్ సర్జరీలు అనేక రకాలు ఉంటాయని, రోగి కంటి నిర్ధిష్ట అవసరాల ఆధారంగా నేత్ర వైద్యులు ఉత్తమమైనదాన్ని నిర్ధారిస్తారని తెలిపారు. ఈ సర్జరీపై కొన్ని అపోహలు కూడా ఉన్నాయన్నారు. లేజర్ రిఫ్రాక్టివ్ సర్జరీ సాధారణంగా నొప్పి లేనిదని తెలిపారు. నొప్పిని తగ్గించే చుక్కలను ఇందులో ఉపయోగిస్తున్నట్లు వివరించారు. రోగులు కొంత ఒత్తిడిని అనుభవిస్తారు తప్పితే నొప్పి అసలు ఉండదని తెలిపారు. ఈ సర్జరీ విజయవంతంగా జరగాలంటే అనుభవజ్ఞులైన నేత్ర వైద్యులను సంప్రదించాలని సూచించారు.

ఘనంగా వివేకానంద పాఠశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం నీళ్లకుండీలలో శ్రీ సాయి స్వామి వివేకానంద పాఠశాల రెండవ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్ర యూనివర్సిటీ ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్ హెచ్‌ఒడి ప్రొఫెసర్ సాల్మన్ రాజు, హుటగాలజీ డైరెక్టర్ ఎలిపి బంగార్రాజు, విజయ భాను కోటె హాజరై మాట్లాడుతూ, విలువలతో కూడిన విద్యను అందించాలన్నారు. విద్యతో పాటు పిల్లల అభివృద్ధికి తగ్గ శారీరక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. పాఠశాల అభివృద్ధి, గత రెండేళ్లలో విద్యార్థులు సాధించిన విజయాల గురించి పాఠశాల డైరెక్టర్లు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యాలు, గీతాలు, నాటికలు, యోగాసన ప్రదర్శనలు నిర్వహించారు. మార్షల్ ఆర్ట్స్,



సాంస్కృతిక ప్రదర్శనలిస్తున్నవిద్యార్థినులు

చిన్నారులు చేసిన బైక్ విన్యాసాలు ఆకట్టుకున్నాయి. చిన్నారుల డ్రిల్, జాతీయ గీతాల ఆలాపన ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం వివిధ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు కె.శర్మ, సిహెచ్.వీరబాబు, వి.సురేష్, లెంక సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పందులు పట్టివేత

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని గంభీరం పంచాయతీ బోయపాలెంలో పందులను గురువారం వలవేసి పట్టుకున్నారు. పందులు గుంపులుగా పంటలకు నష్టం కలిగించడంతో 'పందుల స్వైరవిహారం' శీర్షికన ప్రజాశక్తిలో గురువారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గంభీరం పంచాయతీ అధికారులు స్పందించి గురువారం గ్రామంలో పర్యటించి పొలాల్లో ఉన్న పంటలను పరిశీలించారు. పందులను పట్టేవారిని రప్పించి గ్రామాల్లో ఉన్న పందులను వలవేసి పట్టుకున్నారు. పందుల యజమానికి సమాచారం అందించినా రాకపోవడంతో పట్టుకున్న పందులను మధురవాడ లోగల పందుల దొడ్డిలో పెట్టినట్లు గ్రామ కార్యదర్శి చలపతిరావు తెలిపారు. పందులను గ్రామాల్లో వదిలితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

యువకుడిని కాపాడిన పోలీసులు

ప్రజాశక్తి-గాజువాక : రాజమండ్రిలో ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన గాజువాకకు చెందిన సన్యాసినాయుడును అక్కడి పోలీసులు రక్షించారు. సన్యాసినాయుడు రాజమండ్రిలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నాడు. బెట్టింగులకు బానిసై రూ.50వేలు పోగొట్టుకున్నాడు. తల్లిదండ్రులకు విషయం చెప్పలేక బుధవారం రాజమండ్రిలోని పుష్కరఘాట్ వద్ద గోదావరిలో దూకాడు. దీన్ని గమనించిన రాజమండ్రి త్రీటౌన్ పోలీసులు స్థానికుల సాయంతో యువకుడిని కాపాడారు.

నేరాలు ఘోరాలు

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : మండలంలోని చెట్టుపల్లి గ్రామానికి చెందిన అధికార కృష్ణవేణి అలియాస్ సరోజిని(32) ఆత్మహత్యకు పాల్పడింది. భర్త వేధింపులు తాళలేక ఈ దారుణానికి ఒడిగట్టినట్లు తెలుస్తోంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలివి. చెట్టుపల్లి గ్రామానికి చెందిన అధికార రాజేష్‌తో సరోజినికి 12ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. మూడేళ్లుగా భర్త నుంచి వేధింపులు ఎక్కువగా ఉండడంతో గురవారంఉదయం పిల్లలు స్కూల్‌కు వెళ్ళిన తర్వాత ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరివేసుకొని మృతి చెందింది. నర్సీపట్నం రూరల్ సిఐ రేవతమ్మ, ఎస్ఐ రాజారావు సంఘటనాస్థలాన్ని సందర్శించి, వివరాలను ఆరా తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి పరిశీలించి నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బైక్ నుంచి జారిపడి మహిళ మృతి

ప్రజాశక్తి-నక్కపల్లి : మండలంలోని కాగిత జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం బైక్‌పై నుండి జారిపడి మహిళ మృతి చెందినట్లు ఎస్ఐ సన్ని బాబు తెలిపారు. మునగపాక మండలం, ఒంపోలు గ్రామానికి చెందిన దిమిలి వెంకటలక్ష్మి (46) తన కుమారుడితో కలిసి బైక్‌పై కత్తిపూడి బంధువులు ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా, కాగిత వద్దకు వచ్చేసరికి బైక్ై వెనుకన కూర్చున్న దిమిలి వెంకటలక్ష్మి జారిపడింది. గాయపడ్డ ఆమెను నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సన్ని బాబు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని వెదుళ్ళపాలెం జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. అగనంపూడి నుంచి వి శివకృష్ణ, జే మనోజ్ కుమార్, కె.రవి, ఎం.కష్ణంరాజు కారులో రాజమండ్రి వెళ్తుండగా వీరు ప్రయాణిస్తున్న కారు నక్కపల్లి మండలం, వెదుళ్ళపాలెం జంక్షన్ దాటిన తర్వాత ఆగి ఉన్న లారీని ఢీకొట్టి డివైడర్ పైకి కారు దూసుకుపోయింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న నలుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పెద్ద ప్రమాదం నుండి బయటపడడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదంలో కారు దెబ్బతింది.

యువకుడు అదృశ్యం

ప్రజాశక్తి-మధురవాడ : పోతిన మల్లయ్యపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ యువకుడు షేర్లలో నగదు పోగొట్టుకొని ఇంటునుంచి అదృశ్యమైనట్లు సిఐ జి.బాలకృష్ణ తెలిపారు. సిఐ కథనం ప్రకారం... జివిఎంసి 8వ వార్డు పరిధి ఎండాడ బీసీ సి కాలనీకి చెందిన పిసిని డేవిడ్ ఇంటర్మీడియట్ చదువును మధ్యలోనే ఆపేశాడు. షేర్ మార్కెట్‌లో పెట్టి రూ.6 లక్షలు పోగొట్టుకున్నాడు. మానసిక వేదనకు గురయ్యాడు. ఈ నెల 16వ తేదీ ఉదయం 10 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు ఫోన్ చేస్తే మొబైల్ స్విచ్ ఆఫ్ అయింది. సమీప ప్రాంతాలు, బంధువులు ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో యువకుని తల్లి ఆదిలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సిఐ తెలిపారు.

విద్యార్థి గల్లంతు

ప్రజాశక్తి -గాజువాక : గంగవరం మాధవ స్వామి గుడి బీచ్ దగ్గర యారాడ గ్రామానికి చెందిన శ్రీచైతన్యస్కూల్ విద్యార్థి తనూజ్ (9వ తరగతి) గల్లంతయ్యాడు. యారాడ గ్రామానికి చెందిన 9 మంది బీచ్‌కు వెళ్లగా తనూజ్ గల్లంతయ్యాడు. న్యూ పోర్టు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు.

పోగొట్టుకున్న డబ్బు అందజేత

ప్రజాశక్తి -గాజువాక : పోగొట్టుకున్న డబ్బులను ఆ వ్యక్తికి అందజేసిన ఘటన గాజువాక పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి గాజువాక సిఐ కథనం ప్రకారం... ఈ నెల 15వ తేదీన కోర్ల శివకుమార్, ఆయన కుమార్తెను స్కూల్ నుంచి ఇంటికి తీసుకొస్తుండగా వైదేహి కాట దగ్గరలో రోడ్డుపై గుడ్డ సంచితో రూ.3,60,000 పడి ఉన్నాయి. అక్కడ ఎవరూ లేకపోవటంతో ఆ డబ్బును శివకుమార్ తీసి గాజువాక పోలీసు స్టేషన్‌కు అప్పగించారు. అదే రోజు యాదవజగ్గరాజుపేటకు చెందిన మోడి షణ్ముఖ రావు రూ.3,60,000 విత్ డ్రా చేసుకొని ఇంటికి వెళుతూ మార్గమధ్యంలో పోగొట్టుకున్నట్లు గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేసిన అనంతరం రూ.3,60,000ను మోడి షణ్ముఖకుమార్‌కు అందజేశారు.

మున్సిపల్ కార్మికుల నిరసనల హోరు

ఆప్కాస్‌లో ఉన్న వారిని పర్మినెంట్ చేయాలని డిమాండ్



పెందుర్తిలో మాట్లాడుతున్న రాజు



గాజువాక జోనల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి - యంత్రాంగం

విశాఖ కలెక్టరేట్ : సమస్యలను పరిష్కరించాలని వెంకటేశ్వర థియేటర్ వద్ద ఉన్న జివిఎంసి జోన్ 4 కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికులు నిరసన తెలిపారు. వారినుద్దేశించి జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు టి.నూకరాజు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని చెప్పి, ఆప్కాస్ పెట్టి అందులో మున్సిపల్ కార్మికులను కూడా చేర్చి, పర్మినెంట్ చేయకుండా మోసగించిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అప్కాస్‌ను రద్దుచేసి పాత పద్ధతిలో కాంట్రాక్టర్ల వ్యవస్థ తెస్తామని ఇప్పటికే ప్రకటించిందని, ఈ నిర్ణయం వల్ల వేలాది మంది కార్మికులు తీవ్ర ఆర్థిక దోపిడీకి గురవుతారని అన్నారు. 2024 జనవరిలో జరిగిన సమ్మె ఒప్పందాలను అమలు చేయాలని కోరారు. జోన్ 4 కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఎం.ఈశ్వరరావు, ఎల్లమ్మ, కొండ, ప్రభ, కిషోర్, అనిత, సిఐటియు జగదాంబ జోన్ నాయకులు ఎం.సుబ్బారావు, కె.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ పారిశుధ్య కార్మికులు జోనల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో యూనియన్ జోన్ కమిటీ అధ్యక్షులు ఆర్ఎస్ఎన్.మూర్తి, ఉపాధ్యక్షులు ఎస్.అప్పలనాయుడు, నాయకులు రవ్వ నరసింగరావు, జి సురేష్, ఎం శ్రీను, చిన్నబాబు, ఎస్.ఎర్నిబాబు, కె.జగన్నాధం, వెంకటప్పడు పాల్గొన్నారు.

మధురవాడ, కొమ్మాది : జివిఎంసి జోన్ -2 కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా చేశారు. సమస్యలపై పెద్ద పెత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ప్రసాద్, డి.అప్పలరాజు, సిహెచ్.శేషుబాబు, బి.రత్నం, బి.నరసింగరావు, డి.సూరిబాబు, బి.అప్పారావు, వి.గోవిందరావు, వి.జాన్, కె.ఆర్జునమ్మ పాల్గొన్నారు.

పెందుర్తి : వేపగుంటలోని జోన్-8 కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి ఉరుకుటి రాజు మాట్లాడుతూ ఆప్కాస్ రద్దు చేస్తే మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, అన్ని విభాగాల్లో ఉన్న డెత్, 60, 62 ఏళ్లతో ఆపిన పోస్టులు, సిక్ పోస్టులు, లాంగ్ అబ్సెంట్ పోస్టులను వెంటనే కార్మికుల కుటుంబ సభ్యులకు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. అనంతరం జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో శిర రమణ, పెంటారావు, శ్రీను, ఈశ్వరావు సొములమ్మ, శాంతి, సన్యాశిరావు, జీవా, మాదవ్, సంధ్య, వెంకటరమణ, గౌరి, అప్పారావు, సింహాద్రమ్మ పాల్గొన్నారు.

గాజువాక : జివిఎంసి గాజువాక జోనల్ ఆఫీస్ ఆవరణలో కార్మికులు ధర్నా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పి.వెంకటరెడ్డి, ఎం.రాంబాబు హాజరై మాట్లాడుతూ, మినిమం టైమ్ స్కేల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలని కోరారు. అనంతరం జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గొలగాని అప్పారావు, గొల్ల రాము, నక్క నాగరాజు, సోమధుల గణేష్, మీనాక్షి, అరుణ, సత్యవతి, రాజు, సూర్యనారాయణ, సూరిబాబు, బాలరాజు, సత్యం, శ్రీను పాల్గొన్నారు.



జోన్ -2 కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు



భీమిలి జోనల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు



సచివాలయం విఆర్ఒకు దరఖాస్తులు సమర్పిస్తున్న విజయలక్ష్మి

దళితులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి-గోపాలపట్నం : జివిఎంసి 89వ వార్డు పరిధి యల్లపువానిపాలెం శివారు ఎస్‌సి కాలనీ ప్రజలకు ఇళ్లపట్టాలు మంజూరుచేయాలని సిపిఎం గోపాలపట్నం జోన్ కమిటీ నాయకురాలు ఎస్.విజయలక్ష్మి డిమాండ్‌చేశారు. ఈ మేరకు పేదలచే దరఖాస్తులు చేయించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ, గత 40 ఏళ్లుగా ఇక్కడ నివాసముంటున్న పేద ఎస్‌సి కుటుంబాలకు ఇళ్ల పట్టాలు ఇవ్వలేదని, ప్రస్తుత ప్రభుత్వం జారీ చేసిన జిఒ30ని అనుసరించి ఇక్కడ ఉన్న 70 కుటుంబాలకు పట్టాలు ఇవ్వాలని కోరారు.

సిపిఐ జిల్లా మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- ములగాడ : సిపిఐ విశాఖ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ మల్కాపురంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కాండ్రేగుల సత్యాంజనేయ, గుడాల రాంబాబు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సిపిఐ జిల్లా మహాసభలు మే 10, 11 తేదీల్లో విశాఖ ఉత్తర నియోజకవర్గం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు గండి అప్పారావు, ఎన్‌వి.త్రినాథ్, కె.శ్రీనివాస్, డి.గోపి, టి.కామేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి-ఉక్కునగరం : అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని అన్ని గ్రూపుల్లో ఫస్ట్ మార్కులు సాధించిన విద్యార్థులకు 79వ వార్డు తెలుగు మహిళ అధ్యక్షులు గొల్లవిల్లి కనకభవాని షీల్డ్, పెన్ను, స్వీట్ అందించారు. జిల్లాలోని ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో తృతీయ స్థానం, ద్వితీయ సంవత్సరంలో ద్వితీయ స్థానం పొందడంతో ప్రిన్సిపల్ జి.సుధాకరబాబును సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎడిసి చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు మారుతి కారు వేలం

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 18న సాయంత్రం 4 గంటలకు మారుతి 800 కారు వేలం వేయనున్నట్లు స్టేషన్ ఆఫీసర్ గురువారం తెలిపారు. ఈ నెల 11వ తేదీన అక్రమంగా మద్యం సీసాలను తరలిస్తుండగా కారును సీజ్ చేసినట్లు తెలిపారు. మారుతి 800 బిఎస్ -3 కారుపై ఆసక్తి ఉన్నవారు వేలంలో పాల్గొనాలని కోరారు.

నాటక రంగానికి జీవం పోయండి

ప్రజాశక్తి-ఆనందపురం : తెలుగు నాటక రంగానికి ప్రభుత్వ పెద్దలు జీవం పోయాలని ప్రఖ్యాత రంగస్థల కళాకారుడు ఉప్పాడ అప్పారావు కోరారు. తెలుగు నాటక రంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఒకప్పుడు దేదీప్యమానంగా వెలుగొందిన కళ నేటి ఆధునిక టెక్నాలజీ ప్రభావంతో మసకబారుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. విజ్ఞానంతో పాటు వినోదాన్ని పంచే నాటకరంగాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కళాకారులకు ఆర్థిక స్తోమత కల్పించేలా చర్యలు చేపట్టాలని కోరారు.

150 మందికి దంత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- పద్మనాభం : మండలంలోని విలాస్‌ఖాన్‌పాలెంలో అనిల్ నిరుకొండ హాస్పిటల్ అధ్వర్యాన ఉచిత దంత వైద్య శిబిరం గురువారం ఏర్పాటు చేశారు. 150 మందికి వైద్యులు తనిఖీ చేశారు. దంత సమస్యలు ఎక్కువగా ఉన్నవారికి శుక్రవారం హాస్పిటల్‌కు తీసుకెళ్లి చికిత్స చేయనున్నట్లు హాస్పిటల్ వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ సన్యాసినయుడు, ఆర్మ నాయుడు వైద్య సిబ్బంది డాక్టర్ ఎ.సాయిప్రహర్ష్, డాక్టర్ హదాస్సా, చాందిని, భావన, వరుణ్, పూర్ణిమ, అయేషా, పిఆర్ఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి నాలుగో వార్డు పరిధి కాపులుప్పాడ శ్రీ ప్రకాష్ విద్యా నికేతన్‌లో అగ్నిప్రమాదాల నివారణపై విద్యార్థులకు గురువారం డెమో ద్వారా అవగాహన కల్పించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా చిట్టివలస అగ్నిమాపక శాఖ ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి అగ్నిమాపక శాఖ అధికారి జి.శ్రీనివాసరాజు మాట్లాడుతూ, అగ్నిప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తండ్రిగా నా మాటకు విలువ ఇవ్వలేదు

వంశీరెడ్డి జనసేనలో చేరికపై తిప్పల నాగిరెడ్డి

ప్రజాశక్తి -గాజువాక : 'తండ్రిగా నా మాటకు విలువ ఇవ్వలేదు, నా విజ్ఞప్తిని తోసిపుచ్చి వేరే పార్టీలో చేరాడు. బాధ్యతగా ఉండాల్సిన పెద్ద కొడుకే ఇలా చేస్తాడని అనుకోలేదు' అని పెద్ద కుమారుడు వంశీరెడ్డి జనసేనలో చేరడంపై మాజీ ఎమ్మెల్యే నాగిరెడ్డి ఇలా స్పందించారు. గురువారం సాయంత్రం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో నాగిరెడ్డి మాట్లాడుతూ, తన చేతిలో ఓడిపోయిన పవన్ కల్యాణ్ పార్టీలో వంశీరెడ్డి చేరడం బాధాకరమన్నారు. కుమారుడు చేసిన పనికి జగన్మోహన్‌రెడ్డి దగ్గర తలెత్తుకోలేనన్నారు. కుమారుడిని తానే జనసేనలోకి పంపించానని చెబుతున్నారని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని చెప్పారు. రాజకీయ భిక్ష పెట్టిన వైసిపిని మోసం చేయనని తెలిపారు. గాజువాక సమన్వయకర్తగా దేవన్‌రెడ్డికి కేటాయించడం వల్ల వంశీరెడ్డి జనసేనలోకి వెళ్లిపోయారని తెలిపారు. పార్టీ పెద్దలు బుజ్జగించినప్పటికీ వంశీరెడ్డి ఎవరి మాట వినలేదని చెప్పారు. ఆయన వెళ్లిపోయినంత మాత్రాన పార్టీకి ఎలాంటి నష్టమూ లేదన్నారు. భవిష్యత్తులో దేవన్ రెడ్డి ఎమ్మెల్యే కావడం ఖాయం అన్నారు. ఈ విలేకర్ల సమావేశంలో తిప్పల దేవన్‌రెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా నేడు ర్యాలీ

ప్రజాశక్తి -గాజువాక : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెచ్చిన వక్ఫ్ బిల్లు -2025కు వ్యతిరేకంగా మైనార్టీస్ యునైటెడ్ ఫ్రంట్ ఆధ్వర్యాన శుక్రవారం సాయంత్రం 4 గంటలకు గాజువాకలో భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. ర్యాలీ పాత గాజువాక నుంచి బయలుదేరి కొత్త గాజువాక మీదుగా కణితిరోడ్డు వరకు సాగుతుంది. జిల్లాలో ఉన్న అన్ని మసీదుల పెద్దలు హాజరుకానున్నారు. మొత్తం 7000 మంది వరకు ఈ ర్యాలీలో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి సిపిఎం మద్దతు తెలిపింది. ఇప్పటికే అన్ని మసీదుల వద్ద సమావేశాలు ఏర్పాటుచేసి, ర్యాలీ జయప్రదానికి ఆయా పెద్దలు చర్యలు తీసుకుంటున్నారు. బిజెపి మినహా అన్ని పార్టీల మద్దతు కోరారు.

వంటగ్యాస్ సబ్సిడీని ఖాతాల్లో జమచేయాలి

ప్రజాశక్తి- గాజువాక : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల సబ్సిడీ సొమ్మును లబ్ధిదారులకు వెంటనే బ్యాంకుల్లో జమ చేయాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు సిపిఎం మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యాన లబ్ధిదారులతో కలిసి గాజువాక పౌరసరఫరాల సహాయ అధికారి కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం గత దీపావళి నుంచి పేదలకు 3 ఉచిత వంటగ్యాస్ సబ్సిడీ సిలిండర్లు పథకం ప్రకటించిందని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం గత నవంబర్ నుంచి 2025 మార్చి వరకు లబ్ధిదారులు డబ్బులు చెలించి తీసుకున్న గ్యాస్ సిలిండర్‌కు ప్రభుత్వం నుంచి సబ్సిడీ సొమ్ము అనేకమంది బ్యాంక్ ఖాతాల్లో జమ కాలేదని తెలిపారు. సిపిఎం నిర్వహించిన ప్రజా చైతన్య యాత్రలో భాగంగా చేపట్టిన ఇంటింటి సర్వేలో ప్రజలు ఈ అంశాన్ని పార్టీ శ్రేణుల దృష్టికి తీసుకొచ్చారని, దీంతో లబ్ధిదారులతో దరఖాస్తులు రాయించి గాజువాక ఎఎస్‌ఒకు అందజేశామని తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడత గ్యాస్ సబ్సిడీ అందరికీ అందించినట్లు, రెండో విడత నిధులు విడుదల చేసినట్లు ప్రకటించినా, మొదటి విడత సబ్సిడీ చాలా మందికి అందలేదని తెలిపారు. ప్రభుత్వ పథకం అర్హులందరికీ అందేలా చేయడం ప్రభుత్వ బాధ్యత అని, దీనికనుగుణంగా తక్షణమే చర్యలు చేపట్టాలని జగ్గునాయుడు డిమాండ్ చేశారు. సిపిఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పి.పైడిరాజు మాట్లాడుతూ, ప్రభుత్వం ఇచ్చిన హామీని చిత్తశుద్ధితో అమలుచేయాలని కోరారు. అనంతరం ఎఎస్‌ఒ కృష్ణ మాట్లాడుతూ, గ్యాస్ లబ్ధిదారులందరికీ డబ్బులు జమ్మయ్యేలా చూస్తామని చెప్పారు. ఈ ధర్నా లో సిపిఎం మల్కాపురం జోన్ నాయకులు కె.పెంటారావు, ఎ.సత్యారావు, ఆర్.విమల, పి.వరలక్ష్మి, పి.రామారావు, బి.జగ్గునాయుడు, ఎస్.వాసు, జి.నరేష్ తదితరులు పాల్గొన్నారు.



గాజువాక ఎఎస్‌ఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న లబ్ధిదారులు

ఉపాధి హామీ వేతన బకాయిలు చెల్లించాలి



కూలీలనుద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు నేత గనిశెట్టి సత్యనారాయణ

ప్రజాశక్తి-పరవాడ

గ్రామీణ ఉపాధి హామీ కింద పనులు చేసిన కూలీలకు బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని, చట్టాన్ని ప్రతిష్ఠంగా అమలు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని భరణికం గ్రామంలో ఉపాధి హామీ కూలీలు సిఐటియు ఆధ్వర్యాన గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీకి కేంద్ర బడ్జెట్లో రూ.2 లక్షల కోట్లు కేటాయించాలని, కుటుంబానికి ఏడాదికి 200 పని దినాలు కల్పించాలని, రోజు కూలి రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. మండలంలో కూలీలకు రూ.2 కోట్లు మేరకు బకాయి ఉందని, వారాల తరబడి కూలి డబ్బులు చెల్లించకుంటే వారు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలకు లక్ష్మి, పార్వతి, అప్పల నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలంలోని వాకపల్లి పంచాయతీలో ఉపాధి హామీ కూలీలు పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలని కోరుతూ ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు చేతులెత్తి దండాలు పెడుతూ నిరసన తెలిపారు. వీరికి ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న మద్దతు తెలిపి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా రూ.55 కోట్లు ఉపాధి హామీ బకాయిలు ఉన్నాయని తెలిపారు. 13 వారాలు నుండి వేతనాలు చెల్లించకపోతే కూలీలు ఎలా బతుకుతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూలీలకు పనిముట్లు అలవెన్స్‌లు, సమ్మర్ అలవెన్స్‌లు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.



బకాయి వేతనాలు ఇవ్వాలని దండాలు పెడుతూ నిరసన తెలుపుతున్న దృశ్యం

సబ్ పోస్టాఫీసులో రూ.67,855 నగదు చోరీ

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది సబ్ పోస్టాఫీసులో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. స్థానిక నాలుగు రోడ్ల కూడలి వీరవిల్లి అగ్రహారం రోడ్డులో ఉన్న ఈ పోస్టాఫీసులోకి బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి రూ.67,855 నగదు అపహరించుకుపోయారు. గురువారం ఉదయం పోస్టాఫీసుకు వచ్చిన బ్రాంచి పోస్ట్ మేనేజర్ రాంబాబు దొంగతనం జరిగిన విషయాన్ని గుర్తించారు. బ్రాంచి చెస్ట్ బాక్సులో ఉన్న నగదు అపహరించుకుపోయినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానిక ఎస్సై ఎ.శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. బుధవారం విధి నిర్వహణలో ఉన్న బీపీఎం నాగేంద్ర, సిబ్బందిని లావాదేవీలపై విచారణ చేశారు. క్లూస్ టీమ్‌ను రప్పించి పరిశీలించారు. పోస్టాఫీసుకు సీసీ కెమెరాలు లేకపోవడంతో విచారణకు కొంత ఇబ్బందిగా మారింది.

క్వారీ, డ్రిల్లింగ్ కార్మికుల సమ్మె విజయవంతం

ప్రజాశక్తి-అనకాపల్లి : క్వారీ, డ్రిల్లింగ్ కార్మికులు గత 16 రోజులుగా తమకు కూలి రేట్లు పెంచాలని, 11వ వేతన ఒప్పందాన్ని అమలు చేయాలని కోరుతూ చేపట్టిన సమ్మె ఎట్టకేలకు విజయవంతమైంది. ఈ మేరకు గురువారం జరిగిన సమావేశంలో యజమానులు కూలీ రేట్లు పెంచి, 11వ వేతన ఒప్పందాన్ని చేసుకునేందుకు అంగీకరించినట్లు నాయకులు తెలిపారు. తమ డిమాండ్లపై ఏప్రిల్ 1 నుండి కార్మికులు సమ్మెకు దిగిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో డ్రిల్లింగ్‌కు గతం నుండి చెల్లిస్తున్న రూ.7 నుండి రూ.8 ఇవ్వడం, క్వారీల్లో ప్రమాదాలు జరిగి కార్మికుడు మరణించినా, అంగవైకల్యానికి గురైనా క్వారీ యాజమాన్యం నష్టపరిహారం చెల్లించడం, ప్రమాదం జరిగి కార్మికుడు పనిచేయలేని స్థితిలో ఉంటే, ఆ కార్మికుడి కుటుంబ పోషణకు వారానికి రూ.1000 ఇవ్వడం, కంప్రెషర్ యజమానులు ప్రతీ కార్మికుడికి 10 లక్షల రూపాయలు వరకు ఇన్సూరెన్స్ చేయించడం, కంప్రెసర్ డ్రైవర్ల జీతాలు, బ్లాస్టింగ్ కార్మికుల కూలీ రేట్లు పెంపు అంగీకారం కుదిరింది. ఈ అగ్రిమెంట్ కాల పరిమితి 2 సంవత్సరాల 6 నెలలు పాటు అమలులో ఉంటుందని ఇరువర్గాలు అంగీకరించాయి. కార్యక్రమంలో క్వారీ కార్మిక సంఘ నాయకులు శానాపతి అప్పలనాయుడు, చింతల రమేష్, సేనాపతి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ప్రచారం

ప్రజాశక్తి - కశింకోట : పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరుతూ కశింకోట డిపిఎన్ జెడ్‌పి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎంఆర్‌వి.అప్పారావు, ఉపాధ్యాయులు గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. విద్యార్థులకు ప్రభుత్వం అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తుందని, మంచి నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులతో బోధన చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎ.నాగేశ్వరరావు, ఎ.రవి, పివిఆర్.ప్రభాకర్, బి.ఆనంద్, ఎన్‌జెవి.ప్రసాద్, శేష కుమారి, బి.అప్పారావు, పిఎం.అప్పారావు, నీలవేణి, కమిటీ చైర్మన్ నక్కా నాగమణి పాల్గొన్నారు.

పరవాడ పాలెంలో...

కశింకోట మండలం పరవాడపాలెం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు, గ్రామస్తులు గురువారం పాఠశాల పరిరక్షణ చేసుకుందామంటూ గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడానికి మన వంతు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ బలిజ మంగ ముసిలి నాయుడు, టిడిపి నాయకులు ఉగ్గిని రమణమూర్తి, ఉప సర్పంచ్ గొంతిని ఈశ్వరరావు, స్కూల్ కమిటీ చైర్మన్ దొప్పా లోవరాజు, సిఆర్‌పి పందిరి సత్యబాబు, అంగన్వాడీ కార్యకర్త సేనాపతి నాగమణి, పందిరి ప్రసాద్ పాల్గొన్నారు.

నూకాంబిక జాతర సాంస్కృతిక ప్రదర్శనలకు ఆదరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : శ్రీనూకాంబిక అమ్మవారి రాష్ట్ర పండుగ మహోత్సవాలలో భాగంగా 20వ రోజు బుధవారం రాత్రి వకులమాత కోలాట బృందం వెంకటరత్నం, అరుణ మాకవరపాలెం, కుసుమ హరినాథ్ డాన్స్ అకాడమీ, హరినాథ్, విశాఖపట్నం, చిన్నారుల ప్రదర్శన ఆకట్టుకున్నాయి. పూసర్ల రాజా, బర్నికాన నరసింహమూర్తి, పాలిమేర నాగ, సిరసపల్లి సన్యాసిరావు, పోలిమేర బాలాజీ ముఖ్య అతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కళాకారులకు ప్రశంస పత్రాలు అందజేశారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రవీణ్‌కుమార్ ప్రతిభ

ప్రజాశక్తి-అనకాపల్లి : కృష్ణాజిల్లా గుడివాడలో ఈనెల 13న ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎపి అంతర్ జిల్లాల పోటీలలో జూనియర్ విభాగంలో అనకాపల్లికి చెందిన అవినాష్ పవర్ జిమ్ సభ్యులు ప్రతిభ చూపారు. ఇళ్ల ప్రవీణ్ కుమార్ (59 కేజీల విభాగం) రాష్ట్రస్థాయి బెంచ్ ప్రెస్ పోటీలలో ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నాడు. ప్రవీణ్ కుమార్‌ను జిమ్ చైర్మన్ ఐఆర్.గంగాధర్ ఆధ్వర్యంలో సత్కరించారు.

అనకాపల్లి కళాకారులకు ప్రతిభా పురస్కారాలు

ప్రజాశక్తి-అనకాపల్లి : విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బుధవారం జరిగిన తెలుగు నాటక రంగ దినోత్సవంలో అనకాపల్లి కళాకారులు ప్రతిభా పురస్కారాలు అందుకున్నారు. విశాఖ పోర్టు ట్రస్ట్ ఉద్యోగి పి.ముత్యాలరావు, స్టీల్‌ప్లాంట్ విశ్రాంత ఉద్యోగి పెద్దిశెట్టి రామారావు, దేవాదుల శివాజీ, బిఎస్ఎన్ఎల్ ఉద్యోగి పిసిహెచ్.నాయుడు, భాను తదితర కళాకారులను ఎంపిక చేసి, ఒక్కొక్కరికి పదివేల రూపాయలు నగదు, ప్రశంసా పత్రాలు అందజేశారు. విశాఖ పోర్టు ట్రస్ట్ ఉద్యోగి పి.ముత్యాలరావు మలిసంధ్య, పనికిరాని వాడు, వేదాంతం, ఆట కదరా శివ మొదలగు నాటికల్లో సుమారుగా 100 ప్రదర్శనలు ఇచ్చారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నాటికల పోటీలలో 25సార్లు ఉత్తమ నటుడు, క్యారెక్టర్ ఆర్టిస్ట్ బహుమతులు పొందారు. స్టీల్‌ప్లాంట్ విశ్రాంత ఉద్యోగి పెద్దిశెట్టి రామారావు అనేక పర్యాయములు ఉత్తమ నటుడిగా నంది అవార్డు గెలుచుకున్నారు. 30 పర్యాయములు ఉత్తమ నటుడిగా ఎంపికయ్యారు. దేవాదుల శివాజీ కీర్తిశేషులు దాడి సత్యనారాయణ దర్శకత్వంలో అనేక నాటికల్లో నటించి బహుమతులు గెలుచుకున్నారు. 2012లో ఆంధ్ర యూనివర్సిటీ బెస్ట్ మేకప్ ఆర్టిస్ట్‌గా సత్కారం పొందారు. 2015లో అనకాపల్లిలో అజో- విభో -కందాలం ఫౌండేషన్ వారు రంగస్థల సేవా మూర్తి పురస్కారంతో సత్కరించారు. బిఎస్ఎన్ఎల్ ఉద్యోగి పిసిహెచ్.నాయుడు నేషనల్ కాంపిటీషన్లో మూడు పర్యాయములు ఉత్తమ నటుడు బహుమతులు గెలుచుకొన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో జరిగిన నాటికల పోటీలలో సుమారు 40 సార్లు ఉత్తమ నటుడు, క్యారెక్టర్ నటుడుగా బహుమతులు గెలుచుకొన్నారు. 150 వరకు నాటికలు ప్రదర్శించారు. భాను రాష్ట్రవ్యాప్తంగా 50 నాటిక ప్రదర్శనలు ఇచ్చారు. అనకాపల్లికి చెందిన ఈ కళాకారులు ఈ పురస్కారాలు అందుకోవడం పట్ల పలువురు అభినందించారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి : గర్భిణులు పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ఐసిడిఎస్ ఆధ్వర్యంలో గురువారం పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సామూహిక సీమంతాలు, మూడు నుంచి ఏడు నెలల పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన చిరు ధాన్యాలతో తయారు చేసిన పిండి వంటల స్టాల్‌ను ఎమ్మెల్యే సందర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, టిడిపి మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, శరభాన సూర్యనారాయణ, సిడిపిఒ వి.మంగతాయారు, సూపర్వైజర్లు రాములమ్మ, కళ్యాణి, ఆదిలక్ష్మి, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని గొబ్బూరులో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా సూపర్ వైజర్ సిహెచ్. వంశీ ప్రియా సంపూర్ణ ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ మళ్ల మణి, గ్రామ కార్యదర్శి బి.వెంకట దుర్గ, ఆరోగ్య సిబ్బంది కళ్యాణి, అంగన్వాడీ కార్యకర్తలు విజయలలిత, నాగశ్రీ, వరలక్ష్మి, ఎఎన్ఎం భవాని పాల్గొన్నారు.

పరవాడ : మండలంలోని కోరింగవానిపాలెం గ్రామంలో పోషణ పక్వాడ కార్యక్రమం గురువారం జరిగింది. ప్రతి ఒక్కరు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ వరలక్ష్మి సీతా రామయ్య, మాజీ ఎంపిటిసి శ్రీరామమూర్తి, వార్డు మెంబర్ సోమునాయుడు, నేస్తాలు, సూపర్వైజర్ ఉమా, అంగన్వాడీ కార్యకర్తలు కమల, వరహాలమ్మ, కుమారి, కృష్ణవేణి, పార్వతి, ఆశా పాల్గొన్నారు.

బిఎన్ రోడ్డు అధ్వానంపై వైసిపి వినూత్న నిరసన



రోడ్డుపై గోతులో నిల్వ ఉన్న నీటిలో వల వేసి చేపలు పడుతున్న దృశ్యం

ప్రజాశక్తి వడ్డాది : బిఎన్ రోడ్డు అధ్వాన స్థితిపై బుచ్చయ్యపేట మండలం వడ్డాదిలో వైసిపి నేతలు గురువారం వినూత్నంగా నిరసన తెలిపారు. రోడ్డుపై గోతులో నిల్వ ఉన్న నీటిలో వలలు వేసి చేపలు పట్టి తమ నిరసన తెలియజేశారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు కావస్తున్నా నేటికీ ప్రధాన రహదారుల దుస్థితి ఏమాత్రం మారలేదని వైసిపి నాయకులు ఆరోపించారు. ఈ సందర్భంగా వైసిపి టౌన్ అధ్యక్షుడు దొండా నారాయణమూర్తి మాట్లాడుతూ వడ్డాది నుండి చోడవరం రోడ్ మరింత అధ్వాన స్థితికి చేరుకుందన్నారు. వర్షం కురిస్తే పరిస్థితి మరీ దారుణంగా ఉంటుందన్నారు. ఈ రోడ్డులో ప్రజలు ప్రాణం గుప్పెట్లో పెట్టుకొని ప్రయాణం చేయవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కోరుకొండ రమణ, వార్డు సభ్యులు గుమ్మడి ప్రసాదు, అడపా వరహాలబాబు, ఎస్ఎంసి చైర్మన్ తురాయి మనోహర్, సుంకర నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

వికలాంగ విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ

ప్రజాశక్తి-చోడవరం

జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో వికలాంగ బాలబాలికలకు ఉపకరణాలను గురువారం రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు పంపిణీ చేశారు. బ్రెయిల్ కిట్లు 23 మందికి, బ్యాటరీ సైకిల్ 9 మందికి, సిపి చైర్లు 46 మందికి, క్రచ్ ట్రై సైకిల్ 9 మందికి, రోలెటర్లు 8 మందికి, బోధనోపకరణాల కిట్లు 13 మందికి, ట్రై సైకిల్లు 12 మందికి, వీల్ చైర్లు 73 మందికి, వినికిడి యంత్రాలు 69 మందికి, మొత్తం 262 మంది విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తాతయ్యబాబు మాట్లాడుతూ ఉపకరణాలను వినియోగించుకొని రాణించాలన్నారు. సమగ్ర శిక్ష పథక అదనపు సమన్వయకర్త డాక్టర్ జయప్రకాష్, మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు కార్పొరేట్ సంస్థలు సహాయ సహకారాలు అందిస్తున్నాయని, అందులో భాగంగా ఎన్టిపిసి సింహాద్రి రూ.13 లక్షల విలువైన బోధనోపకరణాలను అందజేసిందని చెప్పారు.



ఉపకరణాలు అందిస్తున్న తాతయ్యబాబు తదితరులు

కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర, రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ పివిజి.కుమార్, డిఇఒ గిడ్డి అప్పారావు నాయుడు, జిల్లా సహిత విద్యా సమన్వయకర్త శకుంతల, గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ గంగాధర్, మండల తహసీల్దార్ రామారావు, ఎంఇఒ సింహాచలం, జడ్పిటిసి విజయ, ఎంపీపీ కాసులమ్మ, సర్పంచ్ బి నూకలమ్మ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై బస్సు షెల్టర్ నిర్మించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి హైవే బైపాస్ రోడ్డు మార్గం వద్ద దూరప్రాంతాలకు వెళ్లే బస్ ప్రయాణికుల సౌలభ్యం నిమిత్తం తక్షణమే బస్ షెల్టర్ నిర్మించాలని కోరుతూ సిద్దార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యాన బైపాస్ రోడ్డు వద్ద ఫ్లెక్సీ, ప్లకార్డులతో గురువారం నిరసన తెలిపారు. అన్ని ఎక్స్‌ప్రెస్, సూపర్ పాస్ట్, లగ్జరీ బస్సులు అనకాపల్లి ఆర్‌టిసి బస్ కాంప్లెక్స్‌కు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఆర్‌టిసి ఏటి ఎన్.వెంకటేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు బల్లా నాగభూషణం, వినకోట నీలేష్ గుప్తా, పట్నాల కృష్ణమోహన్, రొబ్బి మల్లేశ్వరరావు, నందేల అప్పారావు, ఊడా నాగేశ్వరరావు పాల్గొన్నారు.



శారదా వనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొణతాల

శారదావనాన్ని అభివృద్ధి చేస్తాం

ప్రజాశక్తి-కశింకోట : ప్రజలు అందుబాటులో ఉండే విధంగా శారదా వనాన్ని అభివృద్ధి చేస్తామని అనకాపల్లి శాసన సభ్యులు కొణతాల రామకృష్ణ అన్నారు. మండలంలోని బయ్యవరం రెవిన్యూ ఫారెస్ట్ ఏరియాలో నూతనంగా నిర్మించిన శారదావనాన్ని గురువారం ఎమ్మెల్యే సందర్శించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు గొంతిని శ్రీనివాసరావు, ఉగ్గిని రమణమూర్తి, బలిజి ముసిలి నాయడు, మళ్ల బాబు, ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ శాఖల పనితీరుపై అవగాహన

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని 5 ప్రాథమిక పాఠశాలల నుండి ఐదుగురు బాలికలను, ఐదుగురు బాలురను ఎంపిక చేసి వారికి ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, సిఆర్‌టిలతో కలసి స్థానిక ఎంఈఓ- 2 ఎంజె రవీంద్రబాబు ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ శాఖల పని తీరుపై గురువారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీఐ పిన్నింటి రమణ, లైబ్రేరియన్ శిరీష, ఫైర్ స్టేషన్ అధికారి జివి సత్యరాజు, వైద్యాధికారి ఎం.సత్యదీపిక పాల్గొన్నారు.

రేపు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-సబ్బవరం : సబ్బవరం-1, 2 సెక్షన్ పరిధిలోని 33/11కెవి సబ్బవరం, అంతకాపల్లి సబ్ స్టేషన్లలో పిఎంఐ కారణంగా ఈనెల 19న శనివారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు కసింకోర్టు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్బవరం, తవ్వవనిపాలెం, అమృతపురం, గొల్లలపాలెం, పైడివాడ, ఆసకపల్లి, ఇరువాడ, గొట్టివాడ, అరిపాక, అంతకాపల్లి, గుల్లేపల్లి, మొగలిపురం, మల్లునాయుడుపాలెం, అయ్యన్నపాలెం, బాగారమ్మపాలెం, నాయనమ్మ పాలెం, ఎల్లప్పి, వంగలి, గాలిభీమవరం, అడ్డూరు పంచాయతీ పరిధిలోని విద్యుత్ అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

చోరీ సొత్తు రికవరీపై బాధితుల హర్షం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని నీలకంఠాపురం, సీతయ్యపేట గ్రామాల్లో మార్చి నెల 10 జరిగిన దొంగతనాల్లో చోరీ సొత్తును పోలీసులు రికవరీ చేయడంపై ఆయా గ్రామస్తులు గురువారం హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని నీలకంఠాపురం గ్రామానికి చెందిన పడాల శంకర్రావు బంగారు వస్తువులు, సీతయ్యపేటకు చెందిన అల్లు నారాయణ బంగారం వస్తువులు అపహరణకు గురయ్యాయి. జిల్లా వ్యాప్తంగా జరిగిన పలు దొంగతనాలపై పోలీసులు విచారించి చోరీకి పాల్పడిన కోటవురట్ల మండలానికి చెందిన పలువురు యువకుల నుండి పోలీసులు బంగారాన్ని రికవరీ చేసిన విషయం విధితమే.

జెడ్‌పి హైస్కూల్లో కళా వేదిక ప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని తుమ్మపాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సూరిశెట్టి తారకరామ జగన్ ప్రసాద్ సంస్మరణార్థం ఆయన తల్లిదండ్రులు బాబురావు రామలక్ష్మి దంపతులు కళా వేదిక నిర్మాణం నిమిత్తం లక్షా 50 వేల విరాళం అందజేశారు. దీంతో నిర్మించిన కళావేదికను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విరాళ దాత బాబురావు మాట్లాడుతూ తమ కుమారుడు తుమ్మపాల గ్రామంలో పెరిగి సివిల్స్ పరీక్షలో 18వ ర్యాంకు పొంది ఇండియన్ రైల్వే సర్వీస్‌లో అత్యుత్తమ అధికారిగా పనిచేస్తూ గ్రామానికి ఎంతో పేరు తెచ్చారన్నారు. కార్యక్రమంలో సర్పంచు తట్ట పెంటయ్య నాయుడు, ఎంపిటీసీ సభ్యులు కన్నారావు, వెంకటలక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ శంకర్రావు, పాఠశాల కమిటీ చైర్మన్ పెతకంశెట్టి బలరాం పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీల్లో కైరళీ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-దేవరాపల్లి : జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీల్లో దేవరాపల్లి కైరళీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈనెల 5న విజయవాడ డ్రీమ్ యంగ్ అండ్ చిల్డ్రన్ అకాడమి, అటవీశాఖ సంయుక్తంగా నిర్వహించిన జాతీయ స్థాయి చిత్ర లేఖనం పోటీల్లో 123 మంది విద్యార్థులు పాల్గొనగా 12 బంగారు పతకాలు, 16 రజత పతకాలు సాదించారు. బాల ప్రోత్సాహక అవార్డులు అందుకున్నారు. పతకాలు సాధించిన వారిని ఎంఈఓ పడాల్ దాస్ గురువారం అభినందించారు.

అట్రాసిటీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పటిష్టంగా అమలు చెయ్యాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయంలో గురువారం జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హాతో కలిసి జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం చేసేందుకు కేసుల దర్యాప్తు పూర్తిచేసి నిర్ధేశించిన సమయంలోపు చార్జిషీటు ధాఖలు చేయాలని ఆదేశించారు. అట్రాసిటీ కేసుల పురోగతిపై డివిజన్ల వారీగా కలెక్టర్ సమీక్షించారు. దర్యాప్తులో పూర్తి ఆధారాలు సేకరించి సకాలంలో ఛార్జిషీటు ఫైల్ చేయాలన్నారు. రానున్న సమావేశం నాటికి నిర్ధేశించిన సమయంలోపు ఛార్జిషీటు దాఖలు చేయని ఏ ఒక్క కేసు పెండింగ్‌లో ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రతి మూడు నెలలకు తప్పనిసరిగా ఒకసారి జిల్లా స్థాయి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ సమావేశం నిర్వహించాలన్నారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లా స్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు సూచించిన సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్‌ఓ వై.సత్యన్నారాయణ రావు, అనకాపల్లి, నర్సీపట్నం ఆర్డీఓలు షేక్ అయిషా, వివి రమణ, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కె.రాజేశ్వరి, జిల్లా పంచాయతీ అధికారి శిరీషా రాణి, ఇతర జిల్లా అధికారులు, డీఎస్పీలు, కమిటీ సభ్యులు ఆర్ మధుబాబు, గంగాధర్, మరియమ్మ, బి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

ఇడి ఛార్జిషీట్‌లో సోనియా, రాహుల్ పేర్లపై నిరసన



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి-అనకాపల్లి : కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పేర్లను ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ ఛార్జిషీట్‌లో చేర్చడంపై కాంగ్రెస్ ఆధ్వర్యాన అనకాపల్లి గాంధీనగర్‌లో ఉన్న ఆదాయపుపన్ను శాఖ కార్యాలయం వద్ద ఆ పార్టీ నాయకులు గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. గాంధీనగర్‌లోని గాంధీ విగ్రహం నుండి పాదయాత్ర చేసుకుంటూ ఆదాయపు పన్ను శాఖ వరకు వెళ్ళారు. అక్కడ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మీసాల సుబ్బన్న మాట్లాడుతూ దేశంలో రోజురోజుకూ కాంగ్రెస్ ఆదరణ పెరుగుతుందని, సోనియా, రాహుల్ నిత్యం దేశ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను చట్ట సభలలో నిలదీస్తున్నారన్న కక్షతోనే రాజకీయంగా ఇబ్బంది పెట్టాలని బీజేపీ కేంద్ర ప్రభుత్వ సంస్థలను కాంగ్రెస్ నాయకులపై ఎగదోస్తుందని ఆరోపించారు. ఇటువంటి నీచమైన చర్యలను దేశ ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే ఎన్నికలలో బీజేపీకి ఘోర ఓటమి తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మలపురెడ్డి కోటేశ్వరరావు, పడాల కొండలరావు, చిన్నబాబు, రాజులు నాయుడు, సిద్ధా, తుట్టా రమణ, కెవి మాణిక్యం, జి గున్నబాబు, పి.ఆదిమూర్తి పాల్గొన్నారు.

ప్రజా దర్బార్‌లో వినతుల స్వీకరణ

ప్రజాశక్తి-దేవరాపల్లి : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో గురువారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రజలు నుంచి నేరుగా వినతులను స్వీకరించారు. ప్రతి పిర్యాదును ఆన్లైన్లో నమోదు చేసి, సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే బండారు తెలిపారు. ఫిర్యాదు స్థితిని ఫోన్ ద్వారా సమాచారం ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గం పరిశీలకులు వాసురెడ్డి ఏసుదాసు, పార్టీ మండల అధ్యక్ష కార్యదర్శులు చిటిమరెడ్డి సూర్యనారాయణ శరకాన సూర్యనారాయణ, మాజీ ఎంపిపి కిలపర్తి భాస్కరరావు, తహసిల్దార్ పి.లక్ష్మీదేవి, ఎంపీడీవో ఎంవి సువర్ణరాజు, మండల పరిషత్ పరిపాలన అధికారి లక్ష్మీనారాయణ, టి.మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి సమస్యపై గిరిజన సంఘం వినతి

మండలంలో చింతలపూడి పంచాయతీ శివారు మారుమూల గ్రామాలకు మంచినీటి సౌకర్యం కల్పించాలని ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే బండారుకు గురువారం గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బీటీ.దొర వినతిపత్రం అందజేశారు. మదనగరువు, కోక్కల బంధం, జారురాయ్, కొత్తవలస తిదితర గిరిజన గ్రామాలకు తాగునీటి సౌకర్యం లేక ఊటగెడ్డ నీరు తాగుతున్నారని తెలిపారు. దీంతో మలేరియా టైఫాయిడ్, డెంగ్యూ, కలరా వంటి రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పివిటిజి గిరిజన గ్రామాల ప్రజలకు జల్ జీవన్ పథకం ద్వారా వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేసి ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో గిరిజనులు మామిడి చిన్నయ్య, పాంగి పెద్ద భీమన్న, పాంగి రామన్న, మామిడి ఈశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు నేరాలు, చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట మండలంలోని ప్రభుత్వ హైస్కూళ్లలో గురువారం విద్యార్థులకు మహిళలపై జరిగే అఘాయత్యాలు, సైబర్ క్రైమ్ వంటి నేతలు, పోక్సో కేసు, పోలీసు చట్టాలు గురించి అవగాహన కల్పించారు. పోలీస్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనాలలో వీడియో ప్రదర్శనలతో అవగాహన కల్పించారు. మండలంలోని వడ్డాది, దిబ్బిడి, తురకలపూడి, సీతయ్యపేట స్కూళ్లలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో శక్తి టీమ్ సభ్యులు, ఉపాధ్యాయులు, పోలీసులు పాల్గొన్నారు.

దుర్గాలమ్మను దర్శించుకున్న వియ్యపు దంపతులు

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని రావాడ గ్రామపంచాయతీ ధర్మారాయుడుపేట గ్రామంలో శ్రీదుర్గమ్మవారి పండగ మహోత్సవం గురువారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు వియ్యపు చిన్నా సరోజిని దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేకంగా పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



అమ్మవారికి పూజలు చేస్తున్న వియ్యపు చిన్న దంపతులు

'పురమిత్ర యాప్'ను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-యలమంచిలి : మున్సిపాలిటీ సేవలు వినియోగించుకోవడానికి 'పురమిత్ర' యాప్ రూపొందించినట్లు, అందులో 150 రకాల సేవలు అందుబాటులోకి ఉన్నట్లు మున్సిపాలిటీ కమిషనర్ ప్రసాదరాజు తెలిపారు. గురువారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ ఏప్రిల్ 15 నుండి ఈ సేవలను పురప్రజలు వినియోగించుకోవచ్చని చెప్పారు. పారిశుద్ధ్యం, నీటి సరఫరా, వీధిదీపాలు, టౌన్‌ప్లానింగ్, పరిపాలన, ఇంజనీరింగ్, వీధిదీపాలు, రెవెన్యూ విభాగాల సేవలు వంటి 150 సేవలు పొందవచ్చని చెప్పారు. 15 నుండి 30 రోజుల్లో సమస్య పరిష్కారం అవుతుందన్నారు. మనమిత్ర కూడా మొబల్ నెంబర్ 9552300009 ద్వారా సేవ్ చేసుకొని సేవలు పొందవచ్చునన్నారు. ప్రజలు ఆధార్ లింక్డ్ మొబైల్ నెంబరు నుండి జనన, మరణ, సర్టిఫికేట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని చెప్పారు. యుటిలిటీ బిల్లులు, విద్యుత్, నీరు, ఆస్తి పన్ను చెల్లించవచ్చన్నారు. టిటిడి ఆలయ టిక్కెట్లు, వివాహ ధ్రువీకరణ పత్రాలు, ట్రేడ్ లైసెన్సులు పొందవచ్చని చెప్పారు. ఆయ ప్రాంతాల సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్ల ఈ యాప్ విస్తృత ప్రచారం చేస్తారన్నారు. దీన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుంటే ఆఫీసులకు వెళ్లే సమయం ఆదా అవుతుందని కమిషనర్ ప్రసాదరాజు వివరించారు.

అనకాపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా రాము

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా టిడిపి నేత పచ్చికూర రామును రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాము తెలుగుదేశం పార్టీ స్థాపించిన నాటి నుంచి పార్టీలోనే కొనసాగుతున్నారు. ఎంతో మంది ఎన్నో రాజకీయ ప్రలోభాలు పెట్టినా ఎక్కడా తలొగ్గకుండా తన జీవితాన్ని పార్టీ కోసం అంకితం చేసారు. పచ్చికూర రాము మూడు సార్లు టిడిపి మండల అధ్యక్షులుగా, తెలుగు రైతు అధ్యక్షులుగా, జిల్లా విద్యా కమిటీ సభ్యులుగా పనిచేశారు. 1995లో వచ్చిన చట్టం వల్ల ముగ్గురు పిల్లలు ఉండడంతో ఆయన స్థానిక సంస్థల్లో పోటీకి దూరంగా ఉన్నారు. అయితే కూండ్రం గ్రామంలో తన తండ్రి పచ్చికూర సోమినాయుడును, తరువాత 2013లో తన కుమార్తె సేనాపతి స్వరూపను గ్రామ సర్పంచ్‌గా గెలిపించారు. గత పంచాయతీ, ఎంపీటీసీ ఎలక్షన్లో గ్రామంలో సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులను గెలిపించారు. రాముకు మార్కెట్ కమిటీ చైర్మన్ ఇవ్వడం పట్ల టిడిపి క్యాడర్లో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-సబ్బవరం : అగ్ని మాపక వారోత్సవాలులో భాగంగా స్థానిక ప్రభుత్వ సాంఘిక సంక్షేమ ప్రత్యేక బాలికల వసతి గృహం వద్ద గురువారం విద్యార్థినులకు స్థానిక అగ్నిమాపక అధికారి జివి సత్యరాజు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన చర్యలను తెలియజేశారు. కార్యక్రమంలో వసతి గృహం సంక్షేమ అధికారి బషీర్ మున్నీ, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.



అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఫ్లోరైడ్ సమస్య పరిష్కారానికి చర్యలు



పరిశీలనకు వచ్చిన బృందం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : టిడిపి రాష్ట్ర కార్యదర్శి చింతకాయల విజయ్ చొరవతో నర్సీపట్నం మున్సిపాలిటీ 24వ వార్డు అయ్యన్నపాలెంలో ఫ్లోరైడ్ సమస్యపై అధికారుల్లో కదలిక వచ్చింది. ఇటీవల రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపనకు విజయ్ వచ్చినప్పుడు స్థానికులు ఫ్లోరైడ్ సమస్యను ఆయనకు విన్నవించుకున్నారు. వెంటనే స్పందించిన విజయ్ అధికారులను అప్రమత్తం చేశారు. ఈ మేరకు గురువారం విశాఖపట్నం నుంచి ఫ్లోరైడ్ టెస్టింగ్ అధికారులను రప్పించి తగు పరీక్షలు నిర్వహించారు. ఫ్లోరైడ్ సమస్య నుంచి విముక్తికి అవసరమైన చర్యలకు అధికారులు ఉపక్రమించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో 24వ వార్డు కౌన్సిలర్ దనిమిరెడ్డి మధు, మున్సిపాలిటీ ఐటిడిపి ఇంచార్జీ దనిమిరెడ్డి తాతాజీ, వార్డు ప్రజలు పాల్గొన్నారు

మహాలక్ష్మినాయుడుకు సత్కారం



మహాలక్ష్మినాయుడును సత్కరిస్తున్న డిఇఒ, ఇతర అధికారులు

ప్రజాశక్తి - రావికమతం : రాష్ట్ర గూగుల్ ఛాంపియన్ సర్టిఫికేట్ పొందిన రావికమతం మండలం మేడివాడ ప్రత్యేక ఉపాధ్యాయుడు బి.మహాలక్ష్మి నాయుడును డిఇఒ గిడ్డి అప్పారావు నాయుడు, జిల్లా సహిత విద్యా సమన్వయకర్త బి.శకుంతల, చోడవరం ఎంఇఒ సింహాచలం.దుశ్శాలువాతో సన్మానించి మెమొంటోను అందజేశారు. చోడవరం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో వికలాంగ విద్యార్థులకు ఉచిత ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో ఈ సత్కారం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా సహిత విద్య సమన్వయకర్త బి. శకుంతల మాట్లాడుతూ జిల్లాలోని వికలాంగ విద్యార్థులకు సేవలను అందించడమే కాకుండా వారికి ఉపయోగపడే డిజిటల్ టెక్నాలజీ యాప్‌పై రాష్ట్రంలో 26 జిల్లాల్లో ప్రత్యేక ఉపాధ్యాయులకు శిక్షణనిస్తున్న మహాలక్ష్మి నాయుడు సేవలు ప్రశంసనీయమన్నారు. గూగుల్ లుక్ అవుట్, గూగుల్ లైవ్ ట్రాన్స్క్రిబ్ యాప్‌లను ఎక్కువగా ఉపయోగించిన రాష్ట్రంలోని ముగ్గురు రిసోర్స్ పర్సన్‌కు గుర్తించి గూగుల్ ఛాంపియన్ సర్టిఫికెట్‌లను అందించిందని, అందులోమేడవాడ హైస్కూల్ ప్రత్యేక ఉపాధ్యాయుడు మహాలక్ష్మి నాయుడు ఉండడం అభినందనీయమన్నారు.

సూపర్ సిక్స్ హామీలను అమలుచేయాలి

ప్రజాశక్తి -తగరపువలస : ఎన్నికలకు ముందు ప్రజలకు హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ భీమిలి ఏరియా సమితి ఆధ్వర్యాన స్థానిక జంక్షన్‌లో గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ ఏరియా సమితి కార్యదర్శి కానూరు రాంబాబు మాట్లాడుతూ, పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఓ వైపు వంట గ్యాస్ సిలిండర్‌కు సబ్సిడీ ఇస్తున్నట్టుగా చెబుతూ మరో వైపు ధరను పెంచడం ఏ మేరకు సబవని ప్రశ్నించారు. వంట గ్యాస్ సబ్సిడీ ఎక్కువ మందికి అందడం లేదన్నారు. పెంచిన వంట గ్యాస్ ధరను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని, గ్రామీణ పేదలకు మూడు సెంట్లు, పట్టణ ప్రాంత ప్రజలకు రెండు సెంట్ల ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు మోర అప్పలరాజు, సూరిబాబు, గోవింద, రామకృష్ణ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం!

- శిథిలావస్థలో రక్షితనీటి పథకం వాటర్ ట్యాంక్
- భయాందోళనలో పరిసర ప్రాంత నివాసితులు
- ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టని అధికారులు



శిథిలావస్థలో ఉన్న వాటర్ ట్యాంకు

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలో అక్సాహెబ్‌పేట గ్రామంలో రక్షితమంచినీటి పథకం ట్యాంకు శిథిలావస్థకు చేరుకుని ప్రమాదభరితంగా ఉంది. దీంతో పరిసర ప్రాంత నివాసితులు భయాందోళనకు గురౌతున్నారు.

అక్సాహెబ్ పేటలో 20ఏళ్ల క్రితం పదివేల లీటర్ల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన రక్షితమంచినీటి పథకం ట్యాంకును నిర్మించారు.ఈ వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరుకుంది. రామాలయం వెనక నిర్మించిన ఈ వాటర్ ట్యాంకు సమీపంలోనే మండల పరిషత్ పాఠశాల ఉంది, నిత్యం విద్యార్థులు, భక్తులు, జనాలు సంచరించే ప్రాంతాలో ఉన్న రక్షితమంచినీటి పథకం ఓవర్‌హెడ్ ట్యాంకు శిథిలావస్థకు చేరుకోవంక్షే క్షణాన కూలుతుందో, ఎటువంటిప్రమాదం ముంచుకొస్తుందోనని పరిసర ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీనిపై పలుమార్లు స్థానిక నాయకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లి, ఎటువంటి ప్రమాదం, ప్రాణాపాయం సంభవించకముందే శిథిలావస్థకు చేరుకున్న వాటర్ ట్యాంకర్‌ను తొలగించి, దాని స్థానే కొత్త ట్యాంకు నిర్మించాలని స్థానికులు వేడుకుంటున్నారు. తాము ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా తగు చర్యలు చేపట్టాలని వేడుకుంటున్నారు.

అయ్యన్న ఒత్తిడితోనే అక్రమ కేసులు

మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ : రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు



పోలీసులకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఒత్తిడితోనే వైసిపి నాయకులపై పోలీసులు అక్రమ కేసులు బనాయిస్తున్నారని నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆరోపించారు.గురువారం వైసిపి నాయకులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలంటూ నర్సీపట్నం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ మాకవరపాలెం మండలం చామంతిపురం సర్పంచ్ బొడ్డు గోవిందుపై కేసు నమోదు చేశారన్నారు. ఈ నెల 12న గ్రామంలో పరదేశమ్మ పండుగ నిర్వహణకు సర్పంచ్ వినతి మేరకు పోలీసులు అనుమతులు ఇచ్చారన్నారు. పండుగ సందర్భంగా డ్యాన్స్ బేబి డ్యాన్స్ కార్యక్రమం నిర్వహించగా, దానికి సర్పంచ్ బొడ్డు గోవిందును బాధ్యుడిని చేస్తూ పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. ఆ సాంస్కృతిక కార్యక్రమంలో ఎటువంటి అసభ్యకర డాన్స్‌లు లేపోయనా డ్యాన్స్ వేశారనే ఉద్దేశ్యంతో కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. అసభ్యకర నృత్యాలు లేకపోయినా, కేవలం సోషల్ మీడియా పోస్టుల ఆధారంగా సర్పంచ్ గోవింద్‌పై కేసు నమోదు చేయడం దుర్మార్గమన్నారు.

అలాగే గతనెల 29న నర్సీపట్నం మండలం గురందొరపాలెం గ్రామంలో నూకాలమ్మ పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన డ్యాన్స్‌బేబి డ్యాన్స్ కార్యక్రమంలోనూ సర్పంచ్ వెంకటరత్నం అసభ్యకరంగా డ్యాన్స్ వేశారని కేసు నమోదు చేశారన్నారు. వైసిపి నాయకులను ఇరికించి, ఇబ్బంది పెట్టడమే లక్ష్యంగా స్పీకర్ ఒత్తిడితో పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారన్నారు. నాతవరం మండలం వల్సంపేటలో స్వయానా అయ్యన్నపాత్రుడు బావమరిడి డ్యాన్స్ వేస్తే ఎందుకు కేసులు నమోదు చేయలేదని ప్రశ్నించారు. ప్రజల కోసం పోలీసులు పనిచేయాలని, అధికారపార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి అక్రమ కేసులు బనాయించడం సరికాదని హితవు పలికారు.

'ఎస్‌సి వర్గీకరణతో దళితులకు మేలు'



దళిత నాయకులతో కలిసి మాట్లాడుతున్న వెంకటేష్

ప్రజాశక్తి -నక్కపల్లి : దళిత కులాల అభ్యున్నతి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యపడుతుందని టిడిపి మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ అన్నారు. గురువారం నక్కపల్లిలోని పార్టీ కార్యాలయంలో దళిత నాయకులు సమావేశమై కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌సి సెల్ మండలకన్వీనర్ ఏడిద సత్యనారాయణ, కాండ్రకోట రాజారావు మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణ ముసాయిదా ఆర్డినెన్స్‌కు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలపడంపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ధన్యవాదాలు తెలిపారు. దళితుల పట్ల సీఎం చంద్రబాబుకు ఉన్న చిత్తశుద్ధి మరోసారి రుజువైందన్నారు. కొప్పిశెట్టి వెంకటేష్ మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న షెడ్యూల్డ్ కులాల వర్గీకరణ ముసాయిదా ఆర్డినెన్స్‌ను రాష్ట్ర కేబినెట్ ఆమోదంతో 59 ఎస్‌సి ఉపకులాల మధ్య సామాజిక అంతరాలు,వెనుకబాటుతనం ఆధారంగా వర్గీకరణ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. జస్టిస్ రాజీవ్ రంజన్ మిశ్రా ఏకసభ్య కమిషన్ నివేదిక, సుప్రీంకోర్టు తీర్పులను పరిగణనలోకి తీసుకుని, జాతీయ ఎస్‌సి కమిషన్ సూచనల మేరకు ముసాయిదా ఆర్డినెన్స్‌ను సిద్ధం చేసారన్నారు. వర్గీకరణలో 59 ఉపకులాలను మూడు గ్రూపులుగా విభజించారని గ్రూప్-1లోని 12 ఉపకులాలకు 1 శాతం, గ్రూప్-2లోని 18 ఉపకులాలకు 6.5 శాతం, గ్రూప్-3లోని 29 ఉపకులాలకు 7.5 శాతం రిజర్వేషన్లు వర్తింపజేస్తారన్నారు. విద్య,ఉద్యోగాల్లో రిజర్వేషన్ ఫలాలు అన్ని ఉపకులాలకు సమానంగా అందేలా 200 పాయింట్ల రోస్టర్ విధానాన్ని అమలు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. దళిత నేతలు వై.లోవరాజు, పి. లోవరాజు, డి.లోవరాజు, పి.ఈశ్వరరావు, ఆర్.నూక రాజు, వి.రాజేష్, టి.నాని, వి బండేరావు, సిహెచ్‌జి రాజు, పి.శామ్యూల్ పాల్గొన్నారు.

పాడి రైతులు సభ్యులుగా చేరాలి



మాట్లాడుతున్న వెటర్నరీ ఎడి చిట్టినాయుడు

ప్రజాశక్తి - చీడికాడ : పాడిరైతులు పశుగ్రాస రైతు ఉత్పత్తిదారుల సంఘంలో సభ్యులుగా చేరాలని, దీని వల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయని పశుసంవర్ధకశాఖ ఎడి డాక్టర్ చిట్టినాయుడు సూచించారు. గురువారం ఖండివరం గ్రామం విశాఖ డెయిరీ కల్యాణ మండపంలో మండలంలో ఉన్న అన్ని గ్రామాల పాడి రైతులతో సంఘమిత్ర పశుగ్రాస రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చిట్టినాయుడు మాట్లాడుతూ, ఈ సంఘంలో కనీసం 45మంది సభ్యులుగా చేరాలన్నారు ఇఎఫ్‌పిఒలో సభ్యులుగా చేరితే కలిగే ఉపయోగాలను వివరించారు. సంఘంలో సభ్యునిగా చేరేందుకు పాడిరైతులు రూ.500 నుంచి రూ.రెండు వేల వరకు షేరు ధనం చెల్లించాల్సి ఉంటుందన్నారు ఆసక్తిగలవారు గ్రామ సచివాలయాల్లోని వెటర్నరీ సెక్రటరీలను సంప్రదించాలని సూచించారు. సమావేశంలో సంఘమిత్ర ఫార్మర్ ప్రొడ్యూసర్స్ అండ్ గ్రోవర్స్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు చిట్టెమ్మ, ఉపాధ్యక్షులు అప్పలనాయుడు, సభ్యులతోపాటు వైద్యులు డాక్టర్ ఎసిహెచ్ గణేష్ రెడ్డి, డాక్టర్ జి గాయత్రీ దేవి, డాక్టర్ కె రాఘవమ్మ పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి-ఆనందపురం : ఆరోగ్యవంతమైన బిడ్డలను కనేందుకు గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలి ఎంపిడిఒ డాక్టర్ వి.జానకి సూచించారు. పౌష్టికాహార పక్షోత్సవాల సందర్భంగా గురువారం అనందపురం మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే బిడ్డలు బలంగా, ఆరోగ్యవంతంగా జన్మిస్తారన్నారు. స్త్రీ గర్భం దాల్చిన నాటి నుంచి ప్రసవం అయ్యే వరకూ వైద్యుల సూచనల మేరకు మందులు, బలవత్తరమైన ఆహారం తీసుకుంటేనే బిడ్డ పుట్టిన తర్వాత ఎటువంటి అనారోగ్య సమస్యలు రావన్నారు. ఐసిడిఎస్ పిఒ శ్రీదేవి మాట్లాడుతూ, గర్భిణులు ప్రతిరోజూ పాలు, ఆకుకూరలు తప్పక తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించి, ఫలాల కిట్లను అందజేశారు. కార్యక్రమంలో డిటి ఎల్లా చేతన్‌కుమార్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పివివి.రత్నం, జె.రేఖవాణి, సిహెచ్‌ఒ శ్రీనివాసరావు, పార్వతమ్మ, ఎపిఎం రేణుక, ఎస్.ఆదినారాయణ పాల్గొన్నారు.

నింజాస్ అకాడమీ ఆధ్వర్యంలో 20 నుంచి స్పోర్ట్స్ సమ్మర్ క్యాంపు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నం నింజాస్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 20 నుండి స్పోర్ట్స్ సమ్మర్ క్యాంపును స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు అకాడమీ చైర్మన్ వెలగా నారాయణరావు, వెలగా జగన్నాథ్ తెలిపారు. ఈ క్యాంపులో శిక్షణతోపాటు ఉదయం డైట్‌గా పండ్లు, గుడ్లు, బిస్కెట్లు, కేక్స్, రాగి జావ వంటి న్యూట్రీషన్ ఫుడ్ పిల్లలకు అందజేసి, కమశిక్షణ వివిధ ఆటల్లో శిక్షణనిస్తారన్నారు. ఈ ఏడాది సమ్మర్ క్యాంపులో కొత్తగా 10 క్రీడలలో శిక్షణ ఇచ్చే దిశగా సిద్ధం చేస్తున్నారు. కరాటే, వుషూ, బాక్సింగ్, కిక్ బాక్సింగ్, థాయ్ బాక్సింగ్, వాలీబాల్, కబడ్డీ, బాడ్మింటన్, చెస్, క్యారమ్స్, యోగా వంటి వాటిపై ఎన్ఐఎస్ కోచ్‌లతో శిక్షణనిచ్చి, అనంతరం సర్టిఫికెట్లను అందజేయనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

ఈ నెల 18 నుంచి అడ్మిషన్లు ప్రారంభం కానున్నాయని, 5-18 ఏళ్లలోపు బాలబాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.. వివరాలకు సీనియర్ కోచ్ వై.శేఖర్ (9550821021), ఉమెన్ ఎన్ఐఎస్ కోచ్ వి.ప్రియాంక (7382329353) నెంబర్లకు సంప్రదించాలని సూచించారు. ప్రతి రోజూ ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుండి 7 గంటల వరకు మూడు బ్యాచ్‌లుగా శిక్షణ ఉంటుందన్నారు. ఆధార్, ఫొటోతో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. శిక్షణ పొందిన క్రీడాకారులకు పౌష్టికాహారాన్ని బోర్డు ఆఫ్ డైరెక్టర్ సుతాపల్లి శ్రావణ్ అందించనున్నారని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

బాణసంచా గోదాముల్లో తనిఖీలు



తనిఖీలు చేస్తున్న అధికారులు, పోలీసులు

ప్రజాశక్తి- చీడికాడ : కైలాసపట్నం బాణసంచా పేలుడు ఘటనతో అప్రమత్తమైన అధికారులు క్రాకర్స్, టపాసులు, మందు గుండు సామాన్లు నిల్వ ఉంచిన గోదాములను తనిఖీ చేస్తున్నారు. గురువారం మండల స్థాయి అధికారులు సిబ్బందితో కలిసి పలుగోదాములను పరిశీలించారు.

ఇటీవల కోటవురట్ల మండలంకైలాస పట్నం బాణసంచా పేలుడు ఘటనలో 9 మంది మృత్యువాత పడిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చీడికాడ తహశీల్దార్ కిషోర్ లింకన్, డిప్యూటీ తహసిల్దార్, ఎం రాజా, చీడికాడ ఎస్ఐ బి సతీష్, ఎక్సైజ్ సీఐ, గ్రామ పంచాయతీ కార్యదర్శి సచివాలయ సిబ్బంది ఇంజనీర్ అసిస్టెంట్‌తో కలిసి గురువారం మండలంలోని బయలపూడి సమీపానగల అయ్యన్ బాణసంచా గోదాం తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా డిప్యూటీ తహసిల్దార్ రాజా విలేకరులతో మాట్లాడుతూ బాణసంచా నిల్వ ఉంచే గోదాముకు కచ్చితంగా మూడు నుంచి నాలుగు ద్వారమార్గాలు ఉండాలని, ప్రమాదాలు సంభవిస్తే అవసరమైన ముందస్తు నివారణ చర్యలు సిద్ధంగా ఉంచాలన్నారు. కాగా బయలపూడి అయ్యన్ గోదాముకు ఫైర్‌సేఫ్టీ ఉన్నప్పటికీ, ఎన్ఒసి పత్రాలు లేకపోగా, తర్వాత చూపిస్తామని నిర్వాహకులు తెలిపారన్నారు. సిఒటి భద్రత పాటించకపోవడంపై హెచ్చరించారు, గోదాం ఫ్లోర్‌పై రబ్బరు తివాచీ వేయాల్సి ఉండగా, లేనట్లు గుర్తించామన్నారు. అత్యవసర మార్గాలు లేవని, ఏదైనా ప్రమాదం జరిగితే తప్పించుకునే వీలు లేకుండా ఉందని అధికారులు గుర్తించారు. వీటిపై ఉన్నతాధికాలకు నివేదిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్‌కు సత్కారం



ప్రిన్సిపల్‌ను అభినందిస్తున్న పాఠశాల కమిటీ

ప్రజాశక్తి - రావికమతం : ఇంటర్‌లో మంచి ఫలితాలు సాధించిన మండలంలో మరుపాక ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ కె.సత్య సునీల్‌ను గురువారం పాఠశాల విద్యా కమిటీ ఆధ్వర్యంలో చైర్మన్, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ కాశెట్టి రాజు మాట్లాడుతూ ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఇంటర్ పలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించి మండలానికి, పాఠశాలకు తల్లిదండ్రులకు మంచిపేరు తేవడం ఆనందంగా ఉందన్నారు. ప్రిన్సిపాల్ కె.సత్యసునీల్ మాట్లాడుతూ పాఠశాల అధ్యాపకులు, సిబ్బందితోపాటు విద్యార్థులు,వారి తల్లిదండ్రులు, విద్యాకమిటీ అందరి సమిష్టి సహకారం, సమన్వయంతోనే మరువాడ ఆదర్శపాఠశాలలో అత్యుత్తమ ఫలితాలను సాధించామన్నారు. వచ్చే విద్యాసంవత్సరంలోనూ ఇదే సహకారం అందిచాలని, తద్వారా మరింత మెరుగైన ఫలితాల సాధిస్తామన్నారు.

విద్యార్థికి అభినందన

ప్రజాశక్తి-సీతమ్మధార : కాకినాడలో ఆంధ్రా బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఈ నెల 13వ తేదీన నిర్వహించిన సౌత్ ఈస్ట్ జోనల్ బాడీ బిల్డింగ్ ఛాంపియన్ షిప్ 2025 రాష్ట్రస్థాయి పోటీల్లో డాక్టర్ లంకపల్లి బుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల ఇఇఇ ఫైనల్ విద్యార్థి కె.బాలు 65 కేజీల విభాగంలో తలపడి ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి డాక్టర్ జి.మధుకుమార్, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డి.దీపక్‌చౌదరి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జిఎస్‌కె.చక్రవర్తి, వ్యాయామ విభాగాధిపతి డాక్టర్ వై.శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ యు.గంగాభవాని విద్యార్థిని అభినందించారు.

రైతుభరోసా కేంద్రానికి వెళ్లే దారేది?

- రోడ్డు సౌకర్యం లేక సొంత భవనమున్నా పరాయిపంచన
- పక్కా భవనం ప్రారంభించి ఏడాది గడిచినా నేటికీ నిరుపయోగం
- రైతులు, సిబ్బందికి ఇబ్బందులు : ఇదీ బోడపాలెం ఆర్‌బికె దుస్థితి



నిరుపయోగంగా ఉన్న బోడపాలెం ఆర్‌బికె



ప్రారంభోత్సవ శిలాఫలకం

ప్రజాశక్తి -కోటవురట్ల :రహదారి సౌకర్యం లేకపోవడంతో రూ.లక్షల ప్రజాధనంతో నిర్మించిన ప్రభుత్వ భవనాలు నిరుపయోగంగా, వృథాగా పడి ఉన్న పరిస్థితి మండలంలో నెలకొంది. నెలలు గడస్తున్నా అధికారులుగానీ, నేతలుగానీ పట్టించుకోకపోవడంతో వినియోగానికి ముందే శిథిలావస్థకు చేరే ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తమౌతోంది.

మండలంలో బోడపాలెం గ్రామంలో రూ.24.94 లక్షలతో రైతు భరోసా కేంద్రాన్ని ఏడాది క్రితమే నిర్మాణాన్ని పూర్తిచేయడంతోపాటు గత వైసిపి ప్రభుత్వం హయాంలో నాటి ఎమ్మెల్యే, ప్రస్తుత రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు గతేడాది మార్చి 11న అట్టహాసంగా ప్రారంభించారు, అయితే ప్రారంభించిన నాటి నుంచి నేటివరకు ఏనాడూ దీన్ని ఒక్కరోజైనా వినియోగించిన పాపాన పోలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. దీనికి కారణం, ఆ రైతుభరోసా కేంద్రానికి వెళ్లేందుకు రహదారి సౌకర్యం లేకపోవడమే. లక్షల రుపాయల ప్రజాధనం వెచ్చించి భవనాలు నిర్మించిన అధికారులు, నేతలు, వాటికి కనీస రహదారి ఏర్పాటుకు చొరవ చూపకపోవడం విమర్శలకు తావిస్తోంది. దీంతో అన్ని హంగులతో అందంగా తీర్చిదిద్దినప్పటికీ బోడపాలెం ఆర్‌బికె భవనం నిరుపయోగంగా దర్శనమిస్తోంది.



కొండపైకి ఉన్న మట్టిరోడ్డు

పక్కా భవనం ఉన్నప్పటికీ, అక్కడికి వెళ్లేందుకు దారి లేకపోవడంతో ప్రస్తుతం రైతు భరోసా కేంద్రాన్ని స్థానిక సచివాలయంలో నిర్వహిస్తున్నారు, బోడపాలెం, నీలిగుంట గ్రామ పంచాయతీ ల పరిధిలోని రైతులకు సేవలు అందించాల్సిన ఈ కార్యాలయం పరాయిపంచన దిక్కులేనిదిగా కొనసాగుతోంది.

గత ప్రభుత్వహయాంలో హడావిడిగా నిర్మించి, ఆర్భాటంగా ప్రారంభించిన ఎమ్మెల్యే, ఇతర నేతలు, ఆర్‌బికె భవనం వినియోగంలోకి తేవడంలో విఫలమయ్యారు., కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు ఏడాది కావస్తున్నా, నేటికీ బోదపాలెం రైతుభరోసా కేంద్రానికి రహదారి నిర్మాణానికి చొరవ చూపిప పాపాన పోలేదు. గడచిన ఖరీఫ్ సీజన్లో రైతులకు ఎరువులు విత్తనాలను ఇబ్బందికర పరిస్థితుల్లో సచివాలయం నుంచి అందజేశారు. దీంతో అటు సచివాలయం, ఇటు రైతుభరోసా కేంద్రాల సిబ్బంది వసతి సమస్యతో ఇబ్బందులు పడకతప్పడం లేదు. వచ్చే ఖరీఫ్ సీజన్‌లోగా బోడపాలెంరైతుభరోసా కేంద్రానికి రహదారి సౌకర్యం కల్పించి, దాన్ని వినియోగంలోకి తెచ్చే చర్యలు చేపట్టాలని స్థానిక రైతులు కోరుతున్నారు. ఎరువులు, విత్తనాలు నిల్వకు అనువైన భవనం నిర్మించినా, దాన్ని వినియోగంలోకి తేవడంలో నేతలు, అధికారుల నిర్లక్ష్యంపై రైతులు మండిపడుతున్నారు.

మున్సిపాలిటీ సమస్యలపై వినతి



వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నేత రాజు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నం మున్సిపాలిటీల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో సమస్యలపై వినతిపత్రం అందజేశారు. అనంతరం అడిగర్ల రాజు మాట్లాడుతూ ఎన్టీఆర్ స్టేడియానికి ప్రహరీ నిర్మించాలన్నారు. ఉత్తర దిక్కున ప్రహరీ లేనందున ఆసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా ఎన్టీఆర్ స్టేడియం మారిందన్నారు. చిన్న వర్షం కురిసినా పార్కు చెరువుగా మారిపోతొందని నీరు మళ్లించే చర్యలు చేపట్టాలని కోరారు తాగునీటి వసతి కల్పించాలన్నారు.

నర్సీపట్నం మెయిన్‌రోడ్డులో పలు షాపింగ్ మాల్స్ పార్కింగ్‌కు కేటాయించాల్సిన సెల్లార్లను ఓనర్స్ అద్దెలకు ఇచ్చుకోవడం వల్ల ఆయా కూడళ్ళలో విపరీతమైన ట్రాపిక్ సమస్య ఏర్పడుతోందన్నారు. ఆయా షాపింగ్ మాల్స్‌లో వాహనాల పార్కింగ్ బాధ్యతను సంబంధిత దుకాణదారులు చూసేలా చర్యలు చేపట్టాలని,సెల్లార్లను పార్కింగ్ కు కేటాయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పెదబొడ్డేపల్లి, శ్రీరామనగర్ కాలనీ బలిఘట్టంలో పౌర సేవలకు కేటాయించబడిన స్థలాలలో వాకింగ్ ట్రాక్‌లు, వ్యాయామ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. నర్సీపట్నం ప్రధాన మార్కెట్‌ను మున్సిపాలిటీలో విలీనం చేసి అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. టిడ్కో ఇళ్లకు వాటర్, డ్రైనేజీ, సెప్టిక్ ట్యాంకులు, విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేసి లబ్ధిదారులకు అప్పగించాలన్నారు. పట్టణంలో దోమల నిర్మూలనకు తగు చర్యలు తీసుకోవాలన్నారు., పట్టణంలో అనధికారికంగా నిర్వహిస్తున్న మాంసం దుకాణాలను క్రమబద్ధీకరించాలన్నారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణలో నాణ్యమైన మాంసాన్ని వినియోగదారులకు విక్రయించే చర్యలు తీసుకోవాలన్నారు. కుళాయిల్లో మురికి నీరు రాకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా అవసరమగు పారిశుధ్య కార్మికులను నియమించాలని, వారికి అవసరమైన పనిముట్లు అందించాలన్నారు. ప్రజలకు భారమవుతున్న ఆస్తి పన్నును తగ్గించాలని డిమాండ్ చేశారు.


గణితం టాలెంట్ టెస్ట్‌లో విజేతలకు ప్రశంసాపత్రాలు

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలో పెదబోదుగల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాజ్‌కమల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు జయరాం ఎర్రమిల్లి, వింగ్స్ వ్యవస్థాపకులు ఎమ్.ఆనంద్ ఆధ్వర్యంలో గణితం టాలెంట్ పరీక్షలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు గురువారం హెచ్‌ఎం చోడిశెట్టి సత్యనారాయణ, ఫౌండేషన్ వ్యవస్థాపకులు నగదు ప్రోత్సాహకం, ప్రశంసాపత్రాలు, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకులు జయరాం మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని, అందులో భాగంగానే చేపట్టినట్లు విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకత ప్రతిభను వెలికి తీసేందుకు గణితంలో టాలెంట్ టెస్ట్ నిర్వహించామన్నారు. నియోజకవర్గ స్థాయిలో పలు పాఠశాలల్లో వైద్య శిబిరాలు నిర్వహించి, విద్యార్థులకు ఆరోగ్యపరీక్షలు చేయించామని, ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలకు హాజరయ్యే పలు పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా ఒక్కొక్కరికి రూ.500విలువచేసే స్టడీమెటీరియల్ అందించినట్లు తెలిపారు. రాజ్‌కమల్, వింగ్స్ ఫౌండేషన్ సేవాకార్యక్రమాలను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. ఉపాధ్యాయులు ఎన్.వి.ఎస్.ఆచార్యులు, ఎస్.ఫాల్గుణ రావు, కుమారి, చిన్నారావు, శ్రీదేవి, రమేష్‌బాబు పాల్గొన్నారు.



ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఫౌండేషన్ వ్యవస్థాపకులు

జనసేనలో చేరిక



శివగణేష్‌కు కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న నాదెండ్ల

ప్రజాశక్తి-యంత్రాంగం

సీతమ్మధార : వైసిపి ఉత్తర నియోజకవర్గం సీనియర్ నాయకులు ఆళ్ల శివ గణేష్ జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ కండువా కప్పి సాధారణంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆళ్ల శివ గణేష్ మాట్లాడుతూ, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ సిద్ధాంతాలు, పాలన నచ్చి ఆ పార్టీలో చేరినట్లు తెలిపారు. పదవులతో సంబంధం లేకుండా పార్టీ ఏ పని అప్పగించినా క్రమశిక్షణతో పాటిస్తానని చెప్పారు. తన అనుచరులతో సహా జనసేన పార్టీలో చేరినట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గోపాలపట్నం : మాజీ కార్పొరేటర్ బెహరా భాస్కరరావు మంగళగిరిలోని జనసేనపార్టీ కార్యాలయంలో రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సమక్షంలో ఆ పార్టీలో చేరారు. బెహరాతో పాటు అడవివరం సహకార సంఘం డైరెక్టర్లు గునిశెట్టి శ్రీనువాసరావు, గేదెల మురళీకృష్ణ, మార్కెటింగ్ కమిటీ మాజీ డైరెక్టర్ బురిరెడ్డి గోపి, జివిఎంసి 91, 92, వార్డుల నాయకులు జనసేనలో చేరారు.

ఘనంగా చార్లీచాప్లిన్ జయంతి

ప్రజాశక్తి-సీతమ్మధార : ప్రపంచ హాస్య నటుడు చార్లీ చాప్లిన్ 137వ జయంతిని వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యాన విశాఖ పౌరగ్రంథాలయం హాలులో ఘనంగా నిర్వహించారు. వైజాగ్ ఫిలిమ్స్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు, బి.చిన్నారావు తదితరులు చాప్లిన్ చిత్ర ఫటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ, నటనలో తనదంటూ ప్రత్యేక శైలిని ఏర్పర్చుకున్న చాప్లిన్ విశ్వమానవుడని, నటులందరికీ మార్గదర్శకుడని కొనియాడారు. నటనతో ప్రేక్షకులకు హాస్యాన్ని పంచిన చాప్లిన్ మరణం లేని కళాకారుడని కొనియాడారు. కార్యక్రమంలో భాగంగా ఆయన దర్శకత్వంలో 1936లో విడుదలై సంచలనం సృష్టించిన మోడరన్ టైమ్స్ చిత్రాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో హుస్సాన్, జాయింట్ సెక్రటరీ చాట్ల బాబూరావురెడ్డి. కార్యవర్గ సభ్యులు డాక్టర్ జ్ఞానేశ్వర బాబ్జి పాల్గొన్నారు.